తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-21- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 174 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్



- ఆధునిక సాంకేతికతతో ట్రాఫిక్, అర్బన్ ఫ్లడింగ్, సరస్సుల సంరక్షణకు సమగ్ర పరిష్కారాలు
- ఫిజికల్ ఇంటెలిజెన్స్ పైలట్ ప్రాజెక్ట్‌ను ఎనిమిది వారాలపాటు హైదరాబాద్‌లో అమలు
- సీసీటీవీ వ్యవస్థను రియల్‌టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మారుస్తున్న ప్రభుత్వం
- తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను వివరించిన సిఎం రేవంత్
- సమ్మిట్‌కు అలెక్స్ కిప్‌మన్‌కు ఆహ్వానం సిఎం ఆహ్వానం

2లో

## సన్నబియ్యం పంపిణీ పథకం దేశవ్యాప్తంగా అమలు చేయాలి

### కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి సిఫారసు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందని, ఈ సంక్షేమ పథకాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

2లో






## పంచాయితీ ఎన్నికలకు రంగం సిద్ధం !

- పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక
- వారంలో విడుదల కానున్న ఎన్నికల నోటిఫికేషన్!
- డిసెంబర్ 20లోపు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు

**హైదరాబాద్,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు మొత్తంగా 50 శాతం మించకూడదని కమిషన్ సిఫారసు చేసింది. ఈ నివేదిక ఆధారంగా రిజర్వేషన్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేయనుంది.

ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

2లో

## ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్ట్ ఇండియా అనుబంధ కేంద్ర నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయిస్తాం





**హైదరాబాద్,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ–ఈశాన్య రాష్ట్రాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి భారత్ ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్ర నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అనుబంధ కేంద్రంలో ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలు తమకు అనుకూలంగా స్వంత భవనాలను నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందిస్తుందని తెలిపారు.

**తెలంగాణ–నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్**

"సంస్కృతుల సంగమం - సమృద్ధికి సోపానం" పేరిట హైదరాబాద్‌లో ప్రారంభమైన ఉత్సవాల్లో సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, గవర్నర్ సతీమణి సుధా దేవ్ వర్మ, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

2లో



## రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

### ఎంపీ ఈటల రాజేందర్

**జమ్మికుంట,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):**

రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.గురువారం జమ్మికుంటలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్‌మీట్‌లో, రైతుల సమస్యలు, పంట కొనుగోలు, పత్తి మార్కెట్ పరిస్థితులు, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు వంటి కీలక అంశాలపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ పంటలు చేతికొచ్చినా మార్కెట్ యార్డుల్లో కాంటాలు లేకపోవడం, మిల్లర్ల వద్ద రోజులు గడిపినా ధాన్యం దింపుకోనివ్వక రైతులను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని తీవ్రంగా విమర్శించారు. క్వింటాల్‌కు 8 కేజీల తరుగు విధించడం దోపిడీగా అభివర్ణించారు.

రైతులకు ప్రకటించిన సన్నవడ్ల బోనస్ అందరికీ చేరలేదని, ఈసారి మాత్రం ప్రతి రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటం, వర్షాలు-తుఫాన్ల వల్ల భారీగా ముంచిన వరి పంటపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

మిగతా 2లో



## ఇంటింటికి ఇందిరమ్మ చీర

- ఇందిరమ్మ చీరల పంపిణీ పథకం పారదర్శకంగా జరగాలి
- స్వయం సహాయక బృందాల్లో లేని మహిళలకు వెంటనే సభ్యత్వం ఇచ్చి చీరలు అందించాలి
- గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చీరల పంపిణీ సెర్ప్ యాప్‌లో తప్పనిసరిగా నమోదులు
- రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ పంపిణీ
- గ్రామీణ ప్రాంతాల్లో డిసెంబర్ 9 వరకూ కార్యక్రమం
- నియోజకవర్గాలు, మండలాల్లో ప్రారంభ కార్యక్రమాలతో బృందాల ప్రాముఖ్యత చాటాలని ఆదేశాలు
- మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)

**హైదరాబాద్,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):**

ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని సంపూర్ణ క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సెర్ప్ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె, కార్యక్రమం అమలులో ఏవిధమైన లోపాలు ఉండకూడదని సూచించారు.

మహిళల గౌరవం, వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ మహత్తర సంక్షేమ పథకాన్ని ప్రారంభించిందని సీతక్క తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందేలా పంపిణీని ఖచ్చితంగా నిర్వహించాలని ఆమె సూచించారు.

స్వయం సహాయక బృందాల్లో ఇంకా సభ్యత్వం లేని మహిళలకు అవగాహన కల్పించి, వెంటనే సభ్యత్వం ఇచ్చి చీరలను అక్కడికక్కడే అందించాలన్నారు.

8లో

## నాబార్డ్ ఎర్త్ సమ్మిట్‌లో భట్టి విక్రమార్క

- రైతు శక్తితోనే దేశ బలం
- టెక్నాలజీ ఆధారిత వ్యవసాయ మార్పుకు ప్రాధాన్యం
- తెలంగాణ గ్రామీణ అభివృద్ధిలో నాబార్డ్ భాగస్వామ్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లో జరిగిన నాబార్డ్ ఎర్త్ సమ్మిట్ 2025లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. రైతులు, మట్టి, గ్రామీణ సమాజం భారత బలానికి మూలాధారమని ఈ సందర్భంలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలను అమలు చేయడంలో బలమైన సంస్థల పాత్ర కీలకమని, ఆ ప్రయాణంలో నాబార్డ్ అత్యంత

8లో




## స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

**హైదరాబాద్,నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని సూచించారు. గురువారం హైదరాబాద్‌లో నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా పోలీసు అధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రత అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివాస యోగ్య నగరంగా తీర్చిదిద్దడానికి తెలంగాణ ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అనలాగ్ ఏఐ సీఈఓ అలెక్స్ కిప్‌మన్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, పలు కీలక అంశాలపై చర్చించారు.



సమావేశంలో ట్రాఫిక్ నిర్వహణ, అర్బన్ ఫ్లడింగ్ నివారణ, సరస్సుల సంరక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణ వంటి అంశాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సమగ్ర పరిష్కారాలు తీసుకురావాలనే నిర్ణయానికి వచ్చారు. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్‌టైమ్ సెన్సార్ నెట్వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

ఇందులో భాగంగా, హైదరాబాద్ నగరంలో ఫిజికల్ ఇంటెలిజెన్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఎనిమిది వారాలు సాగనున్న ఈ ప్రోగ్రామ్‌లో సీసీటీవీ వ్యవస్థను రియల్‌టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మార్చి, ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలను ఏఐ ఆధారిత అంచనాలతో ఒకే వ్యవస్థలో సమన్వయం చేస్తారు. మొత్తం మానిటరింగ్‌ను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిర్వహించనున్నారు. పైలట్ పూర్తయ్యే సరికి హైదరాబాద్ దేశంలో తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ నగరంగా నిలుస్తుందనే అంచనా ఉంది. భారత్ ఫ్యూచర్ సిటీని పరిశోధన కేంద్రంగా, సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని కూడా సీఎం వివరించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను అమలు చేయడంలో ఫిజికల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని అలెక్స్ కిప్‌మన్ అభిప్రాయపడ్డారు.

డిసెంబర్ 8-9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అలెక్స్ కిప్‌మన్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

# సన్నబియ్యం పంపిణీ పథకం దేశవ్యాప్తంగా అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ షాపుల ద్వారా నేరుగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు.

సన్న బియ్యం పంపిణీ వల్ల పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ తగ్గిందని, బహిరంగ మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజలు నేరుగా వంటకు ఉపయోగించే బియ్యం అందడం వల్ల పథకం లక్ష్యం సాధ్యమైందని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసే అంశంపై సమగ్ర అధ్యయనం చేస్తామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

హైదరాబాద్ పర్యటన సందర్భంగా మంత్రి ప్రహ్లాద్ జోషి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సివిల్ సప్లయిస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్టీఫెన్ రవీంద్రతో పాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ వినియోగం తగ్గుతున్న నేపథ్యంలో, మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని రాష్ట్రానికి సూచించారు. మిగులు ధాన్యం సక్రమ నిర్వహణ కోసం ఎగుమతి అవకాశాలను పరిశీలించాలని సూచించారు.



ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాల్సిన అవసరం ఉందని, బాయిల్డ్ రైస్ అదనపు కోటాను కేటాయించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. రా రైస్‌కు అనువైన రకాల వరిసాగు కోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.



**సమావేశంలో రాష్ట్రానికి సంబంధించి వివిధ అంశాలను సీఎం ప్రస్తావించారు. ఇందులో భాగంగా**

- రబీ 2024–25 కోసం అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా మంజూరు చేయాలి.
- పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలి.
- పీఎంజీకేఏవై అయిదో దశకు పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీ వెంటనే చెల్లించాలి.
- ఖరీఫ్ 2024–25 కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలి.
- ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ సమస్యలు తగ్గించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ రేకులు కేటాయించాలి.
- రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు గోదాం సామర్థ్యం ఏర్పాటుకు కేంద్రం సహకరించాలి.
- 2025–26 ఖరీఫ్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా నేపథ్యంలో, కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలి.









# ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్ట్ ఇండియా అనుబంధ కేంద్ర నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, దేశంలో తొలి "నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రం" నిర్మాణ పనులకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నాయకత్వం వహించాలని కోరారు. కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖతో పాటు ఎనిమిది రాష్ట్రాలతో తెలంగాణ ప్రభుత్వం సమిష్టిగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నదని తెలిపారు.

అస్సాం, అరుణాచల్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు ఈ కేంద్రంలో హాస్టల్ సౌకర్యాలు, ఆహారం, కళలు, సంస్కృతి, చేతి వృత్తులు, ప్రదర్శన వేదికలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

త్రిపురకు చెందిన జిష్ణు దేవ్ వర్మ తెలంగాణ గవర్నర్‌గా, తెలంగాణకు చెందిన ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య ఇప్పటికే బలమైన సంబంధాలు నెలకొన్నాయని సీఎం తెలిపారు.

ఈ ఉత్సవాలు తెలంగాణ-ఈశాన్య రాష్ట్రాల సంస్కృతుల పరస్పర మార్పిడికి నాంది కావడంతో పాటు ఐక్యత స్ఫూర్తిని చాటుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణను రెండో ఇల్లుగా భావించే ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, స్టార్టప్, క్రీడలు వంటి రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ ఇప్పటికే దేశంలో పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానమైందని, చైనా ప్లస్ వన్ వ్యూహంలో తెలంగాణను మరింత ఉన్నత దశకు తీసుకెళ్లాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి రూపుదిద్దుకున్న తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలను ప్రపంచమంతటికి తీసుకువెళ్లేందుకు ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల సహకారం అవసరమని సీఎం అన్నారు.

డిసెంబర్ 8-9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు గవర్నర్ సహకారం కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కళాకారులను సత్కరించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని కమిషనర్ సూచించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయనున్న ఎన్నికల నిర్వహణ కమిటీల సభ్యుల జాబితాను త్వరితగతిన సమర్పించాలని అధికారులను ఆదేశించారు.



# కడియం శ్రీహరి, దానం నాగేందర్‌కు మరోసారి నోటీసులు

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

ఫిరాయింపు కేసులో కడియం శ్రీహరి, దానం నాగేందర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై వివరణ అందించాల్సిందిగా స్పీకర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే అఫిడవిట్ సమర్పించాలని ఈ నోటీసుల్లో పేర్కొనడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ గతంలో నోటీసులు పంపారు. అందులో 8 మంది సభ్యులు స్పందించగా, వారి వివరణలపై విచారణ పురోగమించింది. అయితే కడియం శ్రీహరి, దానం నాగేందర్ మాత్రం సమాధానం ఇచ్చేందుకు అదనపు సమయం కోరడంతో విచారణ ఆలస్యానికి గురైంది. ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేల పిటిషన్లపై విచారణ ఈరోజుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సమాధానం ఇవ్వని ఇద్దరు సభ్యులకు స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేయడం పరిస్థితిని కీలక దశకు తీసుకువెళ్లింది. అనర్హత కేసులపై స్పీకర్ మరింత చురుకుదనంతో వ్యవహరిస్తున్నట్లు అసెంబ్లీ వర్గాలు భావిస్తున్నాయి. విచారణ పూర్తిచేసిన ఎమ్మెల్యేల పిటిషన్లపై న్యాయ సలహాలు తీసుకున్న తర్వాత స్పీకర్ తుది నిర్ణయం వెల్లడించే అవకాశముంది. ఫిరాయింపు కేసులపై వచ్చే నిర్ణయాలు రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులది.



# కవులు కళాకారులు కాదు, విద్యార్థి ఉద్యమకారులు లేకుంటే తెలంగాణ రాష్ట్రం లేదు

అప్పటి విద్యార్థి జేఏసీ చైర్మన్, మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

**బషీర్బాగ్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు, కళాకారుల కంటే విద్యార్థి ఉద్యమకారుల పాత్ర అత్యంత కీలకమైందని అప్పటి విద్యార్థి జేఏసీ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమావేశం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో విద్యార్థులు పోషించిన త్యాగాలు, పోరాటమే తెలంగాణకు పునాది అని స్పష్టం చేశారు.

విద్యార్థులు లేకపోతే ఉద్యమం నిలబెట్టలేకపోయేదని, రాష్ట్రం ఆవిర్భావంలో యువజన శక్తి పోషించిన పాత్రను చరిత్ర మరవలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారులకు తగిన గౌరవం, గుర్తింపు ప్రభుత్వాలు కల్పించకపోవడం విచారకరమన్నారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఉద్యమంలో పాల్గొన్న ప్రతీ కుటుంబానికి ఇంటికో ఉద్యోగం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యమకారులకు ఉద్యమకారుల కోటాలో పింఛన్ తక్షణమే అందించాలని రవి డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమ నాయకులపై నమోదైన పెండింగ్ కేసులను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. ఈ నెల డిసెంబర్ 9న దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

కాకతీయ యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ, కేయూ విద్యార్థి నాయకులకు రాజకీయ రంగంలో, ప్రభుత్వ వ్యవస్థలో సముచిత స్థానం కల్పించకపోతే భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ కూడా భారీ వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాములు నేత మాట్లాడుతూ, ప్రభుత్వ భూములపై తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టే హక్కు ఉందని, ఉద్యమకారులకు ఇప్పటివరకు ప్రభుత్వం పూర్తి న్యాయం చేయకపోవడం ఆందోళనకరమన్నారు. ఒక్క సామాజిక వర్గానికే ప్రాధాన్యం ఇచ్చే విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ సమావేశంలో యాకూబ్ రెడ్డి, దామోదర్, ఫరూక్, జేకే, శ్రీనివాస్ రెడ్డి, ఒస్మానియా నాయకులు ఎండీ రహీం, హనుమంతరావు, అస్మక్ శంకర్, సాంబశివ గౌడ్, రమణ, స్టాలిన్, ఉపేందర్, గుంటీ ప్రభాకర్, బోరెల్లి సురేష్, గణేష్ ముదిరాజ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ ఎన్నికలకు రంగం సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

ఇదే నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈనెల 24 లేదా 25న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించేందుకు సిద్ధమవుతోంది.

మొత్తం 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం వ్యూహరచన చేస్తోంది. డిసెంబర్ 16 నాటికి పంచాయతీ ఎన్నికల మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో సిద్ధతలు కొనసాగుతున్నాయి.

# రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

నష్టపోయిన రైతులకు ప్రకటించిన 10 వేల రూపాయలు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.

పత్తి కొనుగోలులో ఆలస్యం లేకుండా, కఠినంగా అమలు చేస్తున్న 7 క్వింటాళ్ల నిబంధనను ఎత్తివేయాలని, ఈసారి వర్షాల నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని సీసీఐ నిబంధనలు సడలించాలన్నారు. ఫసల్ భీమా సకాలంలో చెల్లించి ఉండి ఉంటే రైతులు ఇబ్బందులు పడరని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ మాదే ... ఈటల ధీమా**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సర్పంచులు, వార్డు సభ్యులు, జేడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, జీపిటీసీ స్థానాల్లో తమకే స్పష్టమైన మెజారిటీ ఉంటుందని ఈటల తెలిపారు. స్థానిక నాయకులు ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్నందున వారి ఆత్మవిశ్వాసం బలంగా ఉందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమని, రెండు మున్సిపాలిటీల్లో కూడా బూత్ స్థాయిలో పటిష్ఠ ఏర్పాట్లతో విజయం సాధిస్తామన్నారు. 107 గ్రామ పంచాయితీల్లో మెజారిటీ స్థానాలు గెలుచుకునే సామర్థ్యం తమకుందని స్పష్టం చేశారు. త్వరలోనే నాయకులు, కార్యకర్తలతో వ్యూహరచన సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. తాను హుజూరాబాద్ ప్రజలకు హామీ ఇస్తున్నానని, గెలిపించిన ప్రజాప్రతినిధుల పనులు పూర్తయ్యే బాధ్యత తనదేనని ఈటల అన్నారు. గతంలో తనపై చేసిన ఆరోపణలపై స్పందిస్తూ, తాను గెలిచిన ఏడాది తరువాతే ఎందుకు ధర్నా చేశారు, ఇప్పుడు గెలిచి రెండు సంవత్సరాలు అయిన తరువాత ఏమి చేశారో ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు.



**హుజూరాబాద్ ప్రజలతో గుండెల్లో ఉన్న బంధం...ఈటల భావోద్వేగం**

హుజూరాబాద్ తనకు 25 ఏళ్లుగా గుండెపోటుగా ఉన్న ప్రదేశమని, ఆ బంధాన్ని ఎప్పటికీ మర్చిపోనని ఈటల పేర్కొన్నారు.

సార్వత్రిక అభివృద్ధికి తాను చేసిన పనులను గుర్తుచేస్తూ— నాలుగు లైన్ రహదారులు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం నిర్మించిన సబ్‌స్టేషన్లు, జలకళ కోసం చెక్‌డ్యామ్‌లు, కమలాపూర్‌లో అభివృద్ధి చేసిన విద్యా కేంద్రం— ఇవన్నీ ప్రజలకు తెలుసని చెప్పారు.

అబద్ధాలను నమ్ముకుని జీవించే నేతలకు ప్రజలే సమాధానం చెబుతారని తీవ్రంగా విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభా, బీజేపీ కన్వీనర్ మాడ గౌతం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, జీడి మల్లేష్, మాజీ సర్పంచ్ సురేందర్ రాజు, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్, మహిళా మోర్చా ప్రతినిధి రమ రెడ్డి, నాయకులు సమ్మయ్య, దేవిక, చొప్పరి వేణు, గుంటూరు ప్రభాకర్, బోరెల్లి సురేష్, గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

**వేలేరు,20 నవంబర్(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై అజ్మీరా సురేష్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో, కారు డ్రైవర్ గుగులోత్ నర్సింహులు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు.వేలేరు లోక్యా తండాకు చెందిన నర్సింహులను తనిఖీల సమయంలో ఆపి శ్వాస పరీక్ష చేయగా, మోతాదుకు మించగా మద్యం సేవించినట్లు తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.కేసును పరిశీలించిన హనుమకొండ రెండవ తరగతి అదనపు న్యాయమూర్తి నర్సింహులకు రెండు రోజుల కారాగార శిక్ష విధిస్తూ తీర్పు తెలిపారు. అనంతరం నిందితుడిని హుజురాబాద్ ఉపజైలుకు తరలించినట్లు ఎస్సై సురేష్ వెల్లడించారు.



## ఫోన్ వదలండి... పుస్తకం పట్టండి

**- గ్రంథాలయాన్ని పరిశీలించిన విశ్వశాంతి విద్యార్థులు.**

**సత్తుపల్లి, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలు. పుస్తకాలు జ్ఞానాన్ని పెంపొందిస్తాయి. ఫోన్ వదలండి... పుస్తకం పట్టండి. 58వ జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక విశ్వశాంతి విద్యాలయం విద్యార్థులు సత్తుపల్లి శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడ వివిధ రకాల అరుదైన పుస్తకాలను, చారిత్రక గ్రంథాలను పరిశీలించారు. వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కథలు పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు, చరిత్ర సంస్కృతి, ప్రముఖుల విజయగాదులకు పుస్తకాలను పరిశీలించారు. పుస్తక ప్రదర్శనను తిలకించారు.

ఈ సందర్భంగా గ్రంథపాలకులు మల్లికార్జున రావు మాట్లాడుతూ... "గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు... విజ్ఞాన భాండాగారాలు. బుక్ రీడింగ్‌తో విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. ప్రతి ఒక్కరూ సెల్ఫోన్ వ్యసనము వదిలి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి'' అని సూచించారు. విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... "జ్ఞానానికి నిలయమైన గ్రంథాలయం అందరికీ ఉచితంగా జ్ఞానం అందిస్తుంది'' అని పేర్కొన్నారు.



## కాలుష్యం లేని పర్యావరణాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలి..

**పుడమి పత్రిక ఎడిటర్ రమేష్ రావు**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** కాలుష్యం లేని పర్యావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని పుడమి పత్రిక ఎడిటర్ రమేష్ రావు అన్నారు.. తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి,సుబ్లేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు ఆయా పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భవిష్యత్ తరాలకు కలుషితం లేని ప్రకృతిని అందించేందుకు ఇప్పుడే చర్యలు ప్రారంభించాలన్నారు..నేటి పరిస్థితుల్లో భూమి, నీరు, గాలి, చివరికి మనం తినే ఆహారం కూడా కలుషితమై ప్రజల ప్రాణాలు తీసేస్తున్నాయన్నారు..ప్రతి విద్యార్థి తమ పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్క నాటి, ఇక సంవత్సరం తర్వాత మొక్కకు కూడా పుట్టినరోజు జరుపుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అలాగే ప్రతి రక్షాబంధన్ రోజున 'వృక్షాబంధన్' చేసి, ఒక చెట్టును కుటుంబ సభ్యుడిగా గుర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం అనంతరం కాకరవాయి ప్రధానోపాధ్యాయుడు నల్లగుంట్ల మధుసూదన్ రావు మాట్లాడుతూ.. మన పాఠశాలలో ఉన్న రావిచెట్టును ఒక మదర్ చెట్టుగా ప్రకటించి దానిపై పిల్లలు అవినవబావ సంబంధం కలిగి ఉండాలని అన్నారు.. అనంతరం అనంతరం మాజీ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎండి రఫీ ఉద్దీన్ మాట్లాడుతూ.. ఔషధ మొక్కలు ఆక్సిజన్ సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతాయని ప్రజలు చెట్లను నాటడం వలన వర్షాలు సమృద్ధిగా కురవడం ద్వారా రైతులకు పంట పొలాల ద్వారా అధిక లాభదాయకం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు... ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు..





# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతు సంఘాల డిమాండ్

**ఎల్కతుర్తి, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు నెమ్మదిగా సాగుతుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ యార్డుల్లో వడ్ల కాంటాలు పడకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోందని రైతు సంఘం నాయకులు తెలిపారు. గురువారం ఐకెపి సెంటర్‌ను సందర్శించిన రైతు సంఘం నాయకులు రైతుల స్థితిగతులను పరిశీలించి సమస్యలను అవగాహన చేసుకున్నారు. ఇప్పటికే ముంతా తుఫాన్ కారణంగా భారీ పంట నష్టం జరిగిన నేపథ్యంలో మరో తుఫాన్ హెచ్చరిక రావడం రైతుల్లో మరింత అనిశ్చితిని కలిగిస్తున్నదని నాయకులు పేర్కొన్నారు. పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి, రైతులకు రావలసిన మొత్తాన్ని బోనస్‌తో సహా వెంటనే చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని రైతు రక్షణ సమితి జిల్లా నాయకుడు హింగే భాస్కర్ అభిప్రాయపడ్డారు. రైతుల బాధలు పట్టించుకోకపోవడం సరైంది కాదని, ప్రజా ప్రభుత్వం నిజంగా రైతుల పక్షాన నిలవాలన్నారు.

అదేవిధంగా వ్యవసాయ మార్కెట్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు తక్షణమే ప్రారంభించాలని కోరుతూ, రైతు సంఘం నాయకులు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సుకినే సంతాజికి వినతిపత్రం అందజేశారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో వరికెల కిషన్ రావు, హింగే భాస్కర్, చోళ రామారావు, లక్కర్స్ మధుకర్, సుకినే సుధాకర్, కోలే విజయ్ కుమార్, కోదారి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ కాలభైరవ దేవాలయంలో ప్రత్యేక పూజలు

**ఉప్పల్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ హెచ్ఎండిఏ బాగాయత్‌లోని శ్రీ కాలభైరవ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఈ పూజల్లో పాల్గొని, ఉప్పల్ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని మొక్కుకున్నారు.కన్నయ పంతులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, ఈ కార్యక్రమంలో పూజల ప్రభాకర్, ఈగ సంతోష్, స్వప్న ముదిరాజ్, వినోద్ రెడ్డి, బొమ్మల సుధాకర్, లింగంపల్లి రామకృష్ణ, రాజు, అలుగుల అనీల్ కుమార్, జనగాం రామకృష్ణ, కన్నమైన నరేష్, బజారు నవీన్ గౌడ్, బొడిగే మల్లేష్ కురుమ, అన్వార్ పాషా, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు

**మేడ్చల్–మల్కాజిగిరి, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజావాణి ఆవరణంలో, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు సరిత పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, గౌరవంతో జీవించడం, విద్యను పొందడం, రక్షణ కలగడం ప్రతి చిన్నారి ప్రాథమిక హక్కులని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి ఆత్మవిశ్వాసం, ఆనందం, సమానత్వం పెంపొందే సురక్షిత వాతావరణం కోసం అందరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ చిన్నారుల అభివృద్ధికి సమానత్వం, అవగాహన, మంచి వాతావరణం అవసరం అని, సమాజం బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలిపారు.సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ ఎస్ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రతి చిన్నారికి విద్య హక్కు కలిగి ఉందని, అందరికీ విద్య అందేలా పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘన గమనించిన వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. పిల్లలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని, విద్యతోనే ప్రతి లక్ష్యంసాధ్యమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డిఎం & హెచ్ఓ, జిల్లా విద్యాశాఖ అధికారులు, డిపిఆర్ఓ మేడ్చల్-మల్కాజిగిరి, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు అర్చన, నాగ జయశ్రీ, రామ్మోహన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం, బాలల సంరక్షణ విభాగ సిబ్బంది, నిర్వాహకులు, చిన్నారులు పాల్గొన్నారు.

# పొరుగు వారి హక్కులు

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులైన పొరుగువారు, పక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీ జనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించండి' అంటుంది ఖురాన్. ఈ వాక్యం మన పొరుగువారితో సాన్నిహిత్యంగా, సత్సంబంధాలను కలిగి ఉండాలని బోధిస్తుంది.

ఇరుగుపొరుగు వారు ఏ మతానికి చెందిన వారైనా సత్సంబంధాలు కలిగి ఉండాలని ఖురాన్ ఉద్బోధ. 'అతను విశ్వాసి కాడు, దైవసాక్షిగా అతను విశ్వాసి కాడు' అన్నారు దైవప్రవక్త. 'ఎవరు?' అని అడి గారు అక్కడున్నవారు. 'పొరుగువారికి అశాంతి కలిగించే వారు' అని ప్రవచించారు. 'జిబ్రీల్ (అస్సలాం) పొరుగు వారిపట్ల మంచిగా ప్రవర్తించాలని ప్రతినిత్యం నాకు తాకీదు చేసేవారు. చివరికి ఇరుగుపొరుగు వారిని పరస్పరం వారసులుగా ప్రకటిస్తారేమో అని నాకు అనుమానం కలగేది' అని ముహమ్మద్ ప్రవక్త చెప్పారు. 'అబూజర్ నువ్వు ఏదైనా కూర వండినప్పుడు అందులో కాస్త నీళ్లు ఎక్కువ పొయ్యి, పొరుగువారిని కూడా కనిపెడుతూ ఉండు' అని పేర్కొన్నారు. ఒకవ్యక్తి ముహమ్మద్ (స) దగ్గరికి వచ్చి 'ఫలానా స్త్రీ ఎన్నెన్నో సమాజులు చేస్తుంది. ఉపవాసాలు పాటిస్తుంది. దానధర్మాలు చేస్తుంది. చాలా ఖ్యాతి పొందింది కూడా, అయితే ఆమె నోటి మాట ద్వారా పొరుగు వారిని కష్టపెడుతుంది' అని చెప్పాడు. దానికి మహాప్రవక్త (సఅసం) 'ఆమె నరకానికే పోతుంది' అని పలికారు. తిరిగి ఆ వ్యక్తి 'దైవప్రవక్తా, మరో మహిళ బహు అరుదుగా నఫిల్ రోజాలు పాటి స్తుంది. అతి స్వల్పంగానే నఫిల్ నమాజులు ఆచరి స్తుంది. పాలజున్ను ముక్కలు కొన్ని మాత్రం దానం చేస్తుంది. కానీ, తన మాటతో పొరుగువారిని ఏనాడూ కష్టపెట్టదు అని చెప్పుకొంటారు' అన్నాడు. ఇది విని మహాప్రవక్త (సఅసం) 'ఈమె స్వర్గ నివాసి' అని సెలవిచ్చారు. ఒకవేళ ఇరుగుపొరుగుతో సంబంధాలు చెడితే వెంటనే వాటిని సరిదిద్దుకోవాలి. వాటిని పునరుద్ధరించుకోవాలి. ఇరుగు పొరుగు విషయంలో తమవల్ల జరిగిన పొరపాట్లకు, తప్పులకు వారిని క్షమాపణ కోరాలి.





రేపటి నుండి నైబర్స్ రైట్స్ క్యాంపెయిన్

జమాఅతె ఇస్లామీ హింద్ దేశవ్యాప్తంగా నవంబర్ 2130 వరకు నైబర్స్ రైట్స్ క్యాంపెయిన్ (పొరుగు వారి హక్కులు) నిర్వహిస్తుంది. పొరుగువారు ఒకరితో ఒకరు సంబంధాలను చక్కదిద్దుకోవడానికి మరియు స్నేహపూర్వక మరియు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి ఈ ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం

శుక్రవారం - 21 - నవంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## కాకర్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో బాలహక్కుల వారోత్సవాలు

**సత్తుపల్లి, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మండల పరిధిలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల భాగంగా 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో విద్యార్థులకు బాలల హక్కులు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాల పై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు.
సిడిపిఓ మెహర్ ఉన్నిసా మాట్లాడుతూ, పిల్లలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని, పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. మంచి-చెడును తెలుసుకుని సమాజంలో మంచినీ గ్రహించే అలవాటు పెంపొందించుకోవాలని, ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో చర్చించే సంస్కారం ఉండాలని ఆమె విద్యార్థులను కోరారు.
కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, కాకర్లపల్లి పంచాయతీ పరిధిలోని అంగన్వాడి సిబ్బంది, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విరాళాల సేకరణ

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మండల వ్యాప్తంగా మండల సమితి ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో విరాళాల సేకరణతో పాటు వాల్ రైటింగ్, గ్రామ శాఖల సమావేశాలను ఏర్పాటుచేసి ప్రచారాన్ని మామ్మురం చేస్తున్నారు. విరాళాల సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం నాగిలి గొండ గ్రామంలో విరాళాలు సేకరణతో పాటు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్మల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ పోరాటాల పురిటి గడ్డ ఖమ్మంలో నిర్వహిస్తున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, నాయకులు ఏపూరి నరసయ్య, షేక్ చిన్న జాన్, అరికోట్ల భాస్కర్, దమ్మాలపాటి శ్రీను, చాట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.




## ఖమ్మం నగరంలో దారుణ హత్య

### భార్యను గొంతు కోసి కిరాతకంగా చంపిన భర్త.....

**ఖమ్మం బ్యూరో ,నవంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండలం నేరేడకు చెందిన గోగుల భాస్కర్ తో జగ్గయ్యపేటకు చెందిన సాయి వాణి కి కొన్ని సంవత్సరాల క్రితం వివాహ మైంది. వీరికి ఓ కుమార్తె 14, కుమారుడు 8 సంవత్సరాలు ఉన్నారు,భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతుండగా భర్తకు దూరంగా ఉంటున్న సాయి వాణి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది, భర్త భాస్కర్ మాత్రం పనీ పాట లేకుండా ఖాళీగా ఉంటున్నట్లు సమాచారం.. గురువారం ఉదయం భార్యను గొంతు కోసి హత్య చేసిన భర్త.. కన్న కూతురిని సైతం కత్తితో చంపేందుకు ప్రయత్నించిన తండ్రి..దాడి నుంచి చాకచక్యంగా తప్పించుకున్న కూతురు ఆమెకు తీవ్ర గాయాలు పూర్తి వివరాలు సేకరిస్తున్న టూ టౌన్ పోలీసులు ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది......

## లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎంపీ కడియం కావ్య






**హన్మకొండ,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 11 మందికి రూ. 6 లక్షల 25 వేల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం ప్రభుత్వానికి ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని, అనేక వేలాది పేద-మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం జీవనాధారంగా మారిందని తెలిపారు. అర్హులైన ప్రతి వ్యక్తి ఈ పథకాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందాలని సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సీఎం సహాయం చేరేలా కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు సీఎం సహాయనిధి అందేలా కృషి చేసినందుకు ఎంపీ కడియం కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పెండింగ్ చెక్కుల వివరాలు సేకరిస్తున్న: ఎమ్మెల్యే జారె





**అశ్వారావుపేట, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఇవ్వాల్సిన పెండింగ్‌లో ఉన్న చెక్కుల వివరాలను హైదరాబాద్ సెక్రటేరియట్‌లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరిశీలించారు.
ఎవరెవరి చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయో, ఏ దశలో ఫైళ్లు ఉన్నాయో, వెంటనే విడుదల కావడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం అర్హులు చేసిన అన్ని దరఖాస్తులు త్వరగా మంజూరు అయ్యేలా స్వయంగా అనుసరిస్తున్నట్టు తెలిపారు. పెండింగ్ చెక్కులు త్వరలోనే ప్రజలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## రోడ్ల విస్తరణలో తొలగించిన బస్టాప్‌లు తిరిగి ఏర్పాటు చేయాలి





### మున్సిపల్ కమిషనర్ వినతి పత్రం బిజెపి నాయకులు

**నాగారం, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం నాగారం మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల విస్తరణ పనుల కారణంగా తొలగించిన బస్టాప్‌లను తిరిగి పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. రాంపల్లి, ఆర్ఎల్ నగర్, ఎస్వీ నగర్, దమ్మాయిగూడ రోడ్లలో బస్టాప్‌ల తొలగింపుతో ప్రజలు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా తెలిపారు. నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జెడ్పీటీసీ సభ్యులు మునిగంటి సురేష్ మాట్లాడుతూ, రాబోయే ఎండాకాలంలో మహిళలు, వృద్ధులు, రోగులు మరింత ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన అదే ప్రాంతాల్లో బస్టాప్‌లను వెంటనే పునర్నిర్మించాలని మున్సిపాలిటీని కోరారు. అదేవిధంగా, బస్టాప్‌లు లేకపోవడంతో ప్రజలు సరైన బస్టాప్ పాయింట్లను గుర్తించడంలో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తాత్కాలికంగా ఫ్లెక్స్ బోర్డుల ద్వారా బస్టాప్ సూచనలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజా శ్రీనివాస్ గౌడ్, బొమ్మిడి బుచ్చిరెడ్డి, నక్క కిషోర్ గౌడ్, అంకర్ల శ్రీనివాస్, మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వర రావు, సూర్యశేఖర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వల్లాల శ్రీనివాస్ గౌడ్, ఎలసాని నాగరాజు యాదవ్, జూపల్లి నరేష్, సతీష్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, వినయ్ రెడ్డి, వెంకటచారి, శ్రీకాంత్ యాదవ్, మధు గౌడ్‌తో పాటు ఎస్వీ నగర్ కాలనీ నివాసులు పాల్గొన్నారు.

## ఐ ఐ ఎఫ్ ఎల్ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండలం నాగిలిగొండ ప్రాథమిక పాఠశాలలో ఐఐఎఫ్ఎల్ సంస్థ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్, వైరా బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్ఎల్ మైక్రో ఫైనాన్స్ సంస్థ డి ఎం మీసాల నాగేంద్రబాబు,వైరా బ్రాంచ్ మేనేజర్ కమటం మహేష్‌లు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుబీనా బేగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారి విద్యా అవసరాల నిమిత్తం వారికి అవసరమైన విద్యా వస్తువులను అందజేయడం చాలా గొప్ప విషయం అని ముందుగా ఐ ఐ ఎఫ్ ఎల్ సంస్థ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.
ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల నాగిలిగొండ(హెచ్. సి) ఉపాధ్యాయులు జమ్మల సురేష్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు ,ఐఐఎఫ్ఎల్ సంస్థ అధికారులు బానోత్ వెంకటేష్, మెరుగు చందు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురుకుల పాఠశాలో పుస్తక ప్రదర్శన

**వనపర్తి,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా వనపర్తి మండలం చిట్యాల గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంతి మాట్లాడుతూ.. చినిగిన చొక్కా అయినా తొడుక్కో--- ఒక మంచి పుస్తకం కొనుక్కో అని పుస్తకాల విలువను ఉదహరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే పుస్తక పఠన అలవాటు పెంపొందించుకోవాలని, రోజూ ఏదో ఒక కొత్త విషయం తెలుసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా స్వతంత్ర సమరయోధులపై పుస్తకాలు, విజ్ఞానానికి సంబంధించిన గ్రంథాలు, వినోద పుస్తకాలు, ఆధ్యాత్మిక రచనలు, కవితలు-కథల పుస్తకాలను ప్రదర్శించారు. విద్యార్థులు పుస్తకాలను ఆసక్తిగా వీక్షించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ప్రశాంతి, లైబ్రేరియన్ డా. రవి, ఏటీపీ పవన్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పుణ్యయాత్రలో పరమపదం



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 20, తెలంగాణ ముచ్చట్లు;** హజ్, ఉమ్రా సమయంలో మరణిస్తే జన్నత్ లభిస్తుందా? తీవ్ర విషాదంలోనూ దాగున్న దైవకృప నవంబర్ 18, 2025 సౌదీ అరేబియాలో ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాదం 42 మంది భారతీయ ఉమ్రా యాత్రికుల జీవితాలను చిదిమేసింది. ఈ హృదయ విదారక ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే, ఈ విషాదకర సమయంలోనే ముస్లిం సమాజంలో ఒక లోతైన విశ్వాసం, అంతర్గత చర్చ మొదలైంది: అల్లాహ్ గృహం వైపు చేసిన ఈ పవిత్ర యాత్రలో మరణించిన వారికి, స్వర్గమైన 'జన్నత్'లో స్థానం లభిస్తుందా? ఈ భయంకరమైన దుర్ఘటన వెనుక దాగిన ఇస్లామిక్ నమ్మకాలు, దైవకృప యొక్క వాగ్దానాలను పరిశీలిద్దాం.

సకల అదృష్టానికి ప్రతీక: సౌదీలోనే ఖననం

సౌదీ అరేబియా నిబంధనల ప్రకారం, హజ్ లేదా ఉమ్రా యాత్రలో మక్కా, మదీనా వంటి పవిత్ర నగరాల్లో మరణించిన వారి మృతదేహాలను స్వదేశానికి పంపరు. అక్కడి ఇస్లామిక్ ఆచారాల ప్రకారం సౌదీలోనే ఖననం చేస్తారు. ఈ నియమం చాలా మందికి కఠినంగా అనిపించినా, ముస్లింలు దీనిని అదృష్టంగా భావిస్తారు. జన్నత్‌ఉల్‌బఖీ లేదా జన్నత్‌ఉల్‌ముఅల్లా వంటి పవిత్ర శ్మశానవాటికల్లో సమాధి కావడాన్ని గొప్ప భాగ్యంగా పరిగణిస్తారు. ప్రవక్త ముహమ్మద్ (స.అ.స) సహచరులు ఖననం చేయబడిన చోట విశ్రమించడం కన్నా, ఒక విశ్వాసికి ఇంతకంటే గొప్ప గౌరవం ఏముంటుంది?

అమరవీరుల హోదా: ఇస్లాం యొక్క వాగ్దానం

హజ్ లేదా ఉమ్రా సమయంలో మరణిస్తే స్వర్గం లభిస్తుందనే నమ్మకానికి ఇస్లామిక్ ధర్మశాస్త్రంలో బలమైన ఆధారం ఉంది. ఇస్లామిక్ పండితులు మరియు హదీసులు (ప్రవక్త బోధనలు) ఈ విషయంపై స్పష్టమైన మార్గదర్శకాలను అందిస్తున్నాయి.

షహీద్ (అమరుడి) స్థానం: ఇస్లామిక్ హదీసుల ప్రకారం, అల్లాహ్ తన ప్రవక్తతో ఇలా అన్నాడు: "ఎవరైతే హజ్ సమయంలో లేదా దాని వెంటనే మరణిస్తారో, వారు అమరుడి (షహీద్) హోదాను పొందుతారు." అంటే, వారు దేవుడి మార్గంలో ప్రాణాలర్పించిన వారి స్థానాన్ని పొందుతారు. ఇది వారి పాపాలను క్షమించి, నేరుగా స్వర్గానికి ప్రవేశించే మార్గాన్ని సుగమం చేస్తుంది.

* నిరంతర ప్రతిఫలం: మరణం తర్వాత కూడా పుణ్యం ఆగకుండా కొనసాగడం ఈ యాత్రలో ప్రాణాలు కోల్పోయిన వారికి లభించే గొప్ప వరం. మరో హదీసులో, "ఎవరైతే హజ్ కోసం బయలుదేరి మరణిస్తారో, వారికి తీర్పు దినం వరకు హాజీ యొక్క ప్రతిఫలం నిరంతరంగా నమోదు చేయబడుతుంది." అని ఉంది. ఉమ్రా విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. అంటే, వారి మరణం అంతం కాదు, అది నిరంతర పుణ్యానికి నాంది.

మరణం కాదు... స్వర్గానికి ఆహ్వానం

ఇస్లామిక్ పండితుడు సలావుద్దీన్ ఖాస్మి చెప్పినట్లుగా: "అల్లాహ్ ఇంటికి ఆరాధన యాత్రలో ప్రపంచాన్ని విడిచిపెట్టిన ముస్లింలు కేవలం మరణించరు. వారు అల్లాహ్ దయతో స్వర్గానికి పిలుపును పొందుతారు. ప్రపంచం దృష్టిలో ఇది మరణం కావచ్చు, కానీ విశ్వాసుల దృష్టిలో ఇది జన్నత్ వైపు ఆహ్వానం.

ఈ విషాద సమయంలో, తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ఈ పవిత్ర వాగ్దానమే కొంత ఓదార్పును ఇస్తుంది. యాత్ర కోసం తెచ్చుకున్న తెల్లని కఫన్ వస్త్రంలోనే వారిని ఖననం చేసి, మస్జిద్ అల్‌హరామ్ వంటి పవిత్ర స్థలాల్లో నమాజ్‌ఎజనాజా సమర్పించడం, ఇదంతా అల్లాహ్ వైపు వారి ప్రయాణానికి అత్యంత గౌరవప్రదమైన వీడ్కోలు. అందుకే, హజ్ లేదా ఉమ్రా సమయంలో మరణించడం అనేది ముస్లింలకు అత్యంత పవిత్రమైన, అదృష్టకరమైన ముగింపుగా పరిగణించబడుతుంది. ఇది వారి విశ్వాసానికి దైవం ఇచ్చిన అత్యున్నత ప్రతిఫలం.

**- ముహమ్మద్ ముజాహిద్**


## పిల్లల్లో పుస్తక పఠనం ఆసక్తి నెలకొల్పాలి..



డిపిఆర్ఓ గౌస్



**ఖమ్మం బ్యూరో, నవంబర్ -20, తెలంగాణ ముచ్చట్లు;** పిల్లల్లో పుస్తక పఠనం ఆసక్తి నెలకొల్పాలని డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్ అన్నారు. డిపిఆర్ఓ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మన వ్యక్తిత్వం పెరుగుతుందని అన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో పుస్తక పఠనం అలవాటు పెంచాలని అన్నారు. పుస్తకాలు జ్ఞాన ధనాగారాలని, పుస్తకాలు లభించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు ఏర్పాటు చేశామని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు మనసుకు దివిటిలని, భవిష్యత్ తరాలు జ్ఞానం వైపు నడవాలంటే ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో గ్రంథాలయాలు చైతన్య కేంద్రాలుగా నిలవాలని డిపిఆర్వో తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కటుకోజ్వుల రమేష్ రచించిన మరో గ్రంథాలయ ఉద్యమం కవితను డిపిఆర్వో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. కరుణ కుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్. రాజు, కార్యదర్శి ఎం.డి. ఇమామ్, ఉద్యోగులు జె. భాస్కర్, సిహెచ్. శ్రీనివాస్, వి. అఖిల్, ఎం. రోహిత్, ఎస్. లలిత కుమారి, కె. విజయకుమారి, బి. నాగలక్ష్మి, ఎం. సుమలత, కె. రవిబాబు, బి. బాబు, అధికారులు, పాల్గొన్నారు.






## సజావుగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి....

రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని

**ఖమ్మం బ్యూరో, నవంబర్ -20, తెలంగాణ ముచ్చట్లు;** గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొనగా, కలెక్టరేట్ నుంచి పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించిందని, సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనుకుంటే, ప్రతి ఫేజ్ లో ఏ మండలాలు ఎన్నికలు జరగాలో జిల్లా వారీగా ప్రణాళికలు అందించాలని అన్నారు. పంచాయతీ తుది ఓటర్ జాబితాకు సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించి, ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎంసిసి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఎంసిసి ఉల్లంఘనపై వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, వార్డులకు సంబంధించి రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు చేసి చెక్ చేసుకోవాలని, ప్రతి వర్గంలో మహిళలకు రిజర్వేషన్ 50 శాతం అమలు కావాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా పంచాయతి అధికారి ఆశాలత, జెడ్పి డిప్యూటీ సిఇఓ నాగపద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారులు విజయలక్ష్మి, రాంబాబు, ఎన్నికల విభాగం సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.





## ఆటో డ్రైవర్లను కడుపులో పెట్టుకొని సాదుకుంటా

- **హరీష్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం**
- **నాయకులు,ఎన్ఆర్ఐ హరీష్ రెడ్డి**

**రామగుండం,నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** గోదావరిఖని-రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మల్లికార్జున నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ అస్లాం ఇంటి ముందు నిలిపిన తన ఆటో ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతై దగ్ధమవడంతో జీవనోపాధిని కోల్పోయాడు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, హరీష్ రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాల హరీష్ రెడ్డి అస్లాం కుటుంబాన్ని పరామర్శించి, రూ.10,000 ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ, రామగుండం నియోజకవర్గంలో ఆటో డ్రైవర్లు ఏ ఆపదలో పడినా, తాను "కడుపులో పెట్టి ఆదుకుంటానని" ఫౌండేషన్ ఏర్పాటు చేసిన రోజునే మాట ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఇప్పటివరకు దాదాపు పది మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఫౌండేషన్ ద్వారా పదివేల రూపాయల చొప్పున సాయం అందించినట్లు తెలిపారు. అస్లాం ఆటో అగ్నికి గురై నిస్సహాయ పరిస్థితిలో ఉండగా అతని స్నేహితుడి ద్వారా విషయం తెలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నట్లు హరీష్ రెడ్డి పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం వల్ల చాలా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆటో డ్రైవర్ల ఆపదలను కనిపెట్టడం తప్పనిసరి బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.పాలకులు మరచిపోయిన ఈ ప్రాంతంలో ఆటో డ్రైవర్లకు ఎలాంటి ఆపద వచ్చినా, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, తమ ఫౌండేషన్ ద్వారా సహాయం కొనసాగిస్తానని హరీష్‌రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎండి జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, మెరుగు చంద్రమౌళి, కృష్ణ స్వామి, బూరుగు వంశీ కృష్ణ, నడిపెల్లి సాయి, బోట్ల పోషం, ఆటో యూనియన్ నాయకులు కడారి శ్రీహరి, అనూ భాయ్, ఎలకపల్లి అంజయ్య, మధు, బండి రాజు, మైనార్టీ నాయకుడు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల నుండి లంచం

## రేగళ్లపాడు సెక్రటరీ సస్పెండ్



**సత్తుపల్లి, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల నుంచి లంచం తీసుకున్న ఘటన సత్తుపల్లి మండలంలో వెలుగుచూసింది. రేగళ్లపాడు గ్రామపంచాయతీ సెక్రటరీ శివ మాధవరావును ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ బుధవారం సాయంత్రం సస్పెండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎలాంటి అవినీతి తావులేకుండా ముందుకు సాగించాలని స్పష్టం చేస్తోంది. అయితే కొందరు అధికారులు వ్యవహరించిన తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేగళ్లపాడు గ్రామంలోని పలువురు లబ్ధిదారులు టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి, సెక్రటరీ శివ మాధవరావు తమ వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన హౌసింగ్ ఎండి వీపీ గౌతమ్, పీడీ శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం అందిన నివేదికను పరిశీలించిన హౌసింగ్ ఎండి, కలెక్టర్‌కు చర్యల కోసం ఆదేశాలు జారీ చేశారు.

తక్షణమే స్పందించిన కలెక్టర్ అనుదీప్, సెక్రటరీ శివ మాధవరావుపై సస్పెన్షన్ ఆదేశాలు అమలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవినీతిని ఏమాత్రం సహించబోమన్న ప్రభుత్వ ధోరణికి ఈ చర్య నిదర్శనంగా నిలిచింది.

# ఐఫోన్ యూజర్లకు శుభవార్త

## ఒకే ఫోన్‌లో రెండు వాట్సాప్ అకౌంట్లు!




ఐఫోన్ వినియోగదారులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఫీచర్‌ను వాట్సాప్ చివరకు అందుబాటులోకి తీసుకురాబోతోంది. ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ ఐఓఎస్ యూజర్ల కోసం ఒకే డివైజ్‌లో రెండు వేరువేరు అకౌంట్లను ఉపయోగించే సౌకర్యం అందించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఐఓఎస్ బీటా వెర్షన్‌లో పరీక్షలు ఎదుర్కొంటోంది. టెస్టింగ్ విజయవంతమైతే త్వరలోనే అన్ని ఐఫోన్ యూజర్లకు రోలౌట్ చేసే అవకాశం ఉందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే వ్యక్తిగత నంబర్, ప్రొఫెషనల్ నంబర్ వాడేవారికి పెద్ద ఊరట లభించనుంది. రెండు అకౌంట్లు ఒకే ఫోన్‌లో ఉన్నా, ప్రతి అకౌంట్‌కు ప్రత్యేకమైన చాట్ హిస్టరీ, బ్యాకప్‌లు, ప్రైవసీ సెట్టింగ్స్ ఉంటాయి. ముఖ్యంగా నోటిఫికేషన్ వచ్చినప్పుడు ఏ అకౌంట్ నుంచి సందేశం వచ్చిందో స్పష్టంగా చూపించడం వల్ల యూజర్‌కు మరింత స్పష్టత, నియంత్రణ లభిస్తుంది.

అదేవిధంగా అకౌంట్లను మార్చేటప్పుడు ఫేస్ ఐడి, పాస్‌కోడ్ వంటి యాప్ లాక్ సెట్టింగ్స్ కూడా వేర్వేరుగా పనిచేస్తాయి. సెక్యూరిటీ పరంగా ఇది యూజర్లకు అదనపు రక్షణను అందిస్తుంది. ఇప్పటివరకు రెండు నంబర్లు వాడే వారు వాట్సాప్ బిజినెస్ వంటి వేరే యాప్‌ను ఉపయోగించాల్సి వచ్చేది. కొత్త ఫీచర్ ప్రారంభమైన తర్వాత ఈ అవసరం తగ్గిపోతుందని టెక్ నిపుణులు భావిస్తున్నారు.

ఫీచర్‌ను యాక్టివేట్ చేయడానికి రెండో నంబర్ అవసరం అవుతుంది. బీటా వెర్షన్ అయినందున ప్రస్తుతం ఇది పరిమిత సంఖ్యలో మాత్రమే అందుబాటులో ఉన్నా, త్వరలో ప్రజలకు మొత్తం విడుదల చేసే అవకాశం ఉంది. ఐఓఎస్‌లో ఇలాంటి ఫీచర్ కోసం చాలాకాలంగా డిమాండ్ ఉన్నందున యూజర్లు ఈ అప్‌డేట్‌ను ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

వాట్సాప్ ప్రకారం, ఈ ఫీచర్ ద్వారా ఐఫోన్ యూజర్లకు మరింత సౌలభ్యం, ఫ్లెక్సిబిలిటీ, నియంత్రణ లభించనుంది. టెస్టింగ్ పూర్తైన వెంటనే విడుదల తేదీని ప్రకటించనున్నట్లు కంపెనీ తెలిపింది.

# దేశాన్ని ఊపేసిన కార్లు.. టాప్ 10 బెస్ట్ సెల్లర్ లిస్ట్ ఇదే

దేశంలో జీఎస్టీ తగ్గింపు, పండుగల హంగామా, పెళ్లిళ్ల సీజన్ కలిసి రావడంతో గత అక్టోబర్‌లో కార్ల విక్రయాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. ఆటోమొబైల్ రంగం మళ్లీ పుంజుకుంటున్న సంకేతాలు ఈ నెల అమ్మకాల గణాంకాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. బైక్‌లు, కార్లపై కేంద్రం జీఎస్టీ తగ్గించిన వెంటనే కస్టమర్లు షోరూమ్‌లకు పరుగులు పెట్టారు. దసరా-దీపావళి ఆఫర్లు, బ్యాంకుల నుంచి సులభ రుణాలు, రూ.10-20వేల వరకు ఇచ్చిన క్యాష్‌బ్యాక్‌లు అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణాలు. ఈ నేపథ్యంలో అక్టోబర్‌లో దేశంలో ఎక్కువగా అమ్ముడైన టాప్ 10 కార్ల వివరాలు ఇలా ఉన్నాయి.

అమ్మకాల పట్టికను టాటా నెక్సాన్ శిఖరస్థానంలో నిలిచేలా దూసుకెళ్లింది. ఒక్క నెలలోనే 22,089 యూనిట్లు విక్రయించబడటం ఈ మోడల్ క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెబుతోంది. టాటా సేఫ్టీ స్టాండర్డ్స్, ఫీచర్లు, కొత్త వేరియంట్లు కస్టమర్లను బాగా ఆకర్షించాయి. రెండో స్థానంలో మారుతీ సుజుకీ డిజైర్ నిలిచింది. 20,791 యూనిట్లు అమ్ముడవ్వడంతో మారుతీ సేడాన్ మార్కెట్‌లో తన హవాను కొనసాగించింది. మూడో స్థానంలో మారుతీ ఎర్టిగా 20,087 యూనిట్ల అమ్మకాలతో నిలవడం గమనార్హం. ఫ్యామిలీలు ఎక్కువగా ఆశ్రయించే ఈ కారుకు డిమాండ్ ఎప్పటికీ స్థిరంగానే ఉంటుంది. నాలుగో స్థానంలో 18,970 యూనిట్లు అమ్ముడైన వాగనార్ ఉంది. గత ఏడాదితో పోలిస్తే వాగనార్ అమ్మకాలు దాదాపు 36 శాతం పెరగడం కంపెనీకి పెద్ద ప్లస్. ఐదో స్థానంలో హ్యుందాయ్ క్రెటా 18,381 యూనిట్ల అమ్మకాలతో నిలిచింది. SUV సెగ్మెంట్‌లో క్రెటాకు ఉన్న ఫాలోయింగ్ మరోసారి రుజువైంది. ఆరో స్థానాన్ని 17,880 యూనిట్ల అమ్మకాలతో మహీంద్రా స్కార్పియో దక్కించుకుంది. కొత్త డిజైన్, రోడ్ ప్రెజెన్స్, ఆఫ్‌రోడింగ్ సామర్థ్యాలు స్కార్పియోను మళ్లీ బెస్ట్‌సెల్లర్ లిస్ట్‌లోకి నెట్టాయి. ఏడో స్థానంలో మారుతీ ఫ్రాంక్స్ 17,003 యూనిట్లతో నిలవగా... ఎనిమిదో స్థానంలో బాలెనో 16,873 యూనిట్ల అమ్మకాలతో చోటు దక్కించుకుంది.


# రూ.500 కోట్లతో విప్రో భారీ యూనిట్




బెంగళూరు ఉత్తరంలోని దొడ్డబపురలో విప్రో నిర్మిస్తున్న భారీ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీ యూనిట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సుమారు రూ.500 కోట్లు వ్యయంతో సిద్ధమవుతున్న ఈ యూనిట్‌లో ఉత్పత్తి కార్యకలాపాలు ఇంకా తొమ్మిది నెలల్లో ప్రారంభమవుతాయని కంపెనీ ప్రధాన అధికారి నీరజ్ పండిట్ తెలిపారు .28వ బెంగళూరు టెక్ సమ్మిట్ సందర్భంగా మాట్లాడిన ఆయన, ప్లాంట్ నిర్మాణం ఆరు నెలల్లో పూర్తవుతుందని, అనంతరం మూడు నెలల్లో పూర్తి స్థాయి ఉత్పత్తి ప్రారంభమవుతుందని చెప్పారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ విస్తరణకు ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయిగా భావిస్తున్నారు.ప్రస్తుతం దేశీయంగా సర్క్యూట్ బోర్డుల తయారీ చాలా తక్కువ. దాంతో సుమారు 85 శాతం అవసరాన్ని విదేశాల నుంచి దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. దేశీయ మార్కెట్ విలువ కేవలం కొన్ని వందల కోట్లలో ఉండగా, ప్రపంచ మార్కెట్ మాత్రం భారీ స్థాయికి చేరింది. భవిష్యత్తులో ఈ రంగం మరింత పెరుగుతుందని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశంలో సర్క్యూట్ బోర్డుల రూపకల్పన, తయారీకి పూర్తిస్థాయి వాతావరణం ఇంకా అభివృద్ధి చెందలేదని, అనేక పనులు విదేశాలకు అప్పగించాల్సి వస్తోందని పరిశ్రమ నిపుణులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దొడ్డబపురలో విప్రో యూనిట్ ఏర్పాటవడం దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీని బలోపేతం చేసే ముఖ్య అడుగుగా వారు అభివర్ణిస్తున్నారు. 2013లో ఐటి కార్యకలాపాల నుంచి వేరు చేసి విప్రో ఎలక్ట్రానిక్స్‌ను ఏర్పాటు చేశారు. హార్డ్వేర్, ఎలక్ట్రానిక్స్ తయారీలో వేగంగా విస్తరిస్తున్న సంస్థకు ఈ కొత్త యూనిట్ ప్రధాన ప్రాజెక్ట్‌గా మారింది.

# మీ సిబిల్ స్కోర్ తక్కువగా ఉందా?

## ఇలా చేస్తే 750 దాటడం ఖాయం




బ్యాంకులో లోన్ కావాలన్నా, క్రెడిట్ కార్డు తీసుకోవాలన్నా ముందుగా పరిశీలించే అంశం సిబిల్ స్కోర్. 750 పైగా ఉంటేనే బ్యాంకులు పెద్దగా ఇబ్బంది పెట్టకుండా లోన్లు మంజూరు చేస్తాయి. అయితే చాలామంది వద్ద ఈ సంఖ్య 650 ప్రాంతంలోనే ఆగిపోతుంది. ఈ సంఖ్య పెద్ద ప్రమాదం కాకపోయినా, మంచి స్థాయి కాదు. అందువల్ల బ్యాంకులు ఇలాంటి స్కోరు ఉన్నవారిపై అనుమానంతో వ్యవహరిస్తాయి. లోన్లు ఇవ్వడానికి వెనకాడతాయి, ఇచ్చినా అధిక వడ్డీ రేట్లు విధించే అవకాశం ఉంటుంది. ప్రీమియం ప్రయోజనాలు కలిగిన క్రెడిట్ కార్డులు దొరకడం కూడా కష్టమే. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, సిబిల్ స్కోర్‌ను మెరుగుపరచడం అంత కష్టమైన పని కాదు. కొంచెం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే 650 స్కోరు 700-750 మధ్యకు చేరడం చాలా సులభం. ముఖ్యంగా తీసుకున్న ఈఎంఐలను గడువులోపే చెల్లించడం అత్యంత కీలకం. ఒక్కరోజు ఆలస్యం చేసినా స్కోరుపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. 30 రోజుల ఆలస్యం అయితే మరింత పెద్ద దెబ్బ. అందుకే చాలామంది ఆటోపే అమలు చేస్తే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే క్రెడిట్ కార్డు లిమిట్ ఎంత ఉన్నా దాని మూడవ వంతు కంటే ఎక్కువ వినియోగించకపోవడం మంచిదని ఆర్థిక వర్గాలు చెబుతున్నాయి. లిమిట్ ఎక్కువగా వాడితే అప్పులపై మీరు అధికంగా ఆధారపడుతున్నారని బ్యాంకులు భావిస్తాయి.

ఇంకా తక్కువ వ్యవధిలో ఎక్కువ లోన్లకు, క్రెడిట్ కార్డులకు దరఖాస్తు చేయడం కూడా స్కోరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇలాంటి చర్యలు సిబిల్ రిపోర్టులో 'ఇన్క్వైరీలు' పెంచుతాయి. దీంతో స్కోరు కొంతకాలం తగ్గిపోతుంది. అలాగే తరచూ మీ క్రెడిట్ రిపోర్ట్‌ను పరిశీలించడం కూడా చాలా అవసరం. కొన్ని సందర్భాల్లో ఇప్పటికే పూర్తయిన లోన్లు పెండింగ్‌గా చూపించబడే తప్పులూ రావచ్చు. అలాంటి పొరపాట్లను వెంటనే సరిచేయించుకుంటే స్కోరుపై ఉన్న చెడు ప్రభావం తొలగిపోతుంది.

పాత లోన్లు, పాత క్రెడిట్ కార్డులు కూడా స్కోరును పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అవి ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తే మీ క్రెడిట్ చరిత్ర బలపడుతుంది. ఇది బ్యాంకుల ముందు మీ విశ్వసనీయతను పెంచుతుంది. ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరించే వ్యక్తుల స్కోరు కొద్ది నెలల్లోనే గణనీయంగా మారిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ సూచనలు పాటిస్తే 650-660 స్కోరు ఉన్నవారు కూడా కొద్దికాలంలో 750 దాటే అవకాశం ఉంది. మంచి స్కోరు ఉన్నప్పుడు లోన్లు తక్కువ వడ్డీకే, సులభంగా లభిస్తాయి. భవిష్యత్తులో ఏ ఆర్థిక అవసరం వచ్చినా సులభంగా పరిష్కారం కాగలదనే నమ్మకాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

# పేటీఎం యూజర్లకు శుభవార్త..

## ప్రైవసీ కోసం వినూత్న 'దాచిన చెల్లింపులు' సౌకర్యం




డిజిటల్ లావాదేవీలు దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వినియోగదారుల వ్యక్తిగత గోప్యతను కాపాడేందుకు పేటీఎం కొత్తగా ప్రవేశపెట్టిన సౌకర్యం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు ప్రజలు చేసిన యూపీఐ లావాదేవీలను యాప్‌లో దాచిపెట్టే అవకాశం ఏ ఇతర యాప్‌లోనూ లేకపోయినా, పేటీఎం ఇప్పుడు ఆ అవకాశాన్ని కల్పించింది.

ఈ కొత్త సౌకర్యం ద్వారా వినియోగదారులు తమ చెల్లింపు చరిత్రను పూర్తిగా సురక్షిత స్థలంలో దాచిపెట్టవచ్చు. అవసరమైనప్పుడు మాత్రం అవి తిరిగి అందుబాటులోకి వస్తాయి. తొలగించే సౌకర్యం కాకపోయినా, చూపించకుండా ఉంచే అవకాశం రావడంతో వ్యక్తిగత ప్రైవసీ మరింత బలపడనుంది.

పేటీఎం తెలిపిన వివరాల ప్రకారం, దాచిన లావాదేవీలు ఏ విధంగానూ మార్చబడవు, తొలగించబడవు. అవి కేవలం సాధారణ చరిత్ర జాబితాలో కనిపించవు అంతే. వినియోగదారులు ఎప్పుడైనా తమ మొబైల్ పిన్ లేదా వేలిముద్ర/ముఖ గుర్తింపు ద్వారా వాటిని సురక్షిత విభాగంలో చూడవచ్చు. ప్రస్తుతం ఈ సౌకర్యాన్ని అందిస్తున్న ఏకైక యాప్‌గా పేటీఎం నిలిచింది.

ఈ కొత్త సౌకర్యాన్ని ఉపయోగించడం కూడా చాలా సులభం. వినియోగదారులు దాచాలనుకున్న లావాదేవీపై ఎడమవైపుకు స్వైప్ చేస్తే 'దాచు' అనే ఎంపిక వస్తుంది. దానిపై నొక్కితే ఆ చెల్లింపు సమాచారాన్ని యాప్ ప్రత్యేకంగా రూపొందించిన భద్ర విభాగంలో ఉంచుతుంది.

అలాగే దాచిన చెల్లింపులను తిరిగి చూడాలనుకునే సమయంలో పేటీఎం యాప్‌లోని 'బ్యాలెన్స్ అండ్ హిస్టరీ' విభాగంలో ఉన్న మూడు చుక్కల గుర్తుపై నొక్కి 'దాచిన చెల్లింపులను వీక్షించండి' అనే ఎంపికను ఎంచుకోవచ్చని పేటీఎం చెబుతోంది.

డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతున్న ఈ కాలంలో, వినియోగదారుల ప్రైవసీపై దృష్టి పెట్టడం అత్యంత కీలకమవుతోంది. అలాంటి సమయంలో పేటీఎం తీసుకొచ్చిన ఈ వినూత్నమైన 'దాచిన చెల్లింపులు' సౌకర్యం మరింత సురక్షిత అనుభవాన్ని అందించనుంది. వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని పరిరక్షించే దిశలో ఈ అడుగు ఎంతో ప్రయోజనకరమని నిపుణులు భావిస్తున్నారు.

# క్రెడిట్ కార్డు తీసుకోవాలనుకుంటున్నారా?



ఇప్పటి కాలంలో దాదాపు ప్రతి కుటుంబంలోనూ క్రెడిట్ కార్డు ఒక అవసరంగా మారింది. ఉద్యోగం చేసే వారు, వ్యాపారం చూసుకునే వారు, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారు—అందరూ ఈ ప్లాస్టిక్ మనీపై ఆధారపడుతున్నారు. అత్యవసర సమయంలో మన దగ్గర డబ్బు లేకపోయినా కొనుగోళ్లు చేసే వీలుండటం, ఆఫర్లు ఎక్కువగా రావటం, సౌకర్యవంతంగా చెల్లింపులు చేసుకోవటం వంటి ప్రయోజనాల వల్ల క్రెడిట్ కార్డుల వినియోగం వేగంగా పెరిగిపోయింది. అయితే అన్ని కార్డులు ఒకే విధంగా ఉండవు. కొన్ని సంస్థలు చేరిక రుసుము, వార్షిక రుసుము పేరుతో పెద్ద మొత్తంలో వసూలు చేస్తుంటే... మరికొన్ని మాత్రం పూర్తిగా ఉచితంగా కార్డులు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది వినియోగదారులు "ఎటువంటి రుసుములు లేకుండా లభించే ఉత్తమ క్రెడిట్ కార్డులు ఏవి?" అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల అవసరాలు, రుసుముల వివరాలు, అందించే ప్రయోజనాలు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటే... ప్రస్తుతం దేశంలో కొన్ని ప్రధాన బ్యాంకులు అందిస్తున్న కార్డులు అత్యంత లాభదాయకంగా నిలుస్తున్నాయి. దేశంలో అగ్రగామి బ్యాంకులలో ఒకటైన ఐసీ ఐసీ ఐ బ్యాంకు, ఆన్‌లైన్ వ్యాపార వేదికల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన తమ కార్డు ద్వారా వినియోగదారులకు పూర్తిగా ఉచిత సేవలు అందిస్తోంది. ఇందులో చేరిక రుసుము ఉండకపోవటం మాత్రమే కాదు, సంవత్సర రుసుము కూడా పూర్తిగా మాఫీ చేశారు. రోజువారీ కొనుగోళ్లలో ఎక్కువ ప్రయోజనం కోరే వారికి ఇది మంచి ఎంపికగా నిలుస్తోంది. మరోవైపు యాక్సిస్ బ్యాంకు అందిస్తున్న కార్డు కూడా తక్కువ రుసుముతో లభించడం, ఎక్కువ వినియోగం చేస్తే రుసుము మాఫీ అవడం వంటి కారణాలతో ప్రజాదరణ పొందింది. దేశంలో అత్యధిక వినియోగదారులు కలిగిన ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బిఐ అందిస్తున్న ఒక ప్రత్యేక కార్డు మాత్రం ఎక్కువ క్యాష్‌బ్యాక్ అందించడం వల్ల వినియోగదారుల్లో పెద్ద ఆదరణ పొందుతోంది. సంవత్సర రుసుము ఉన్నప్పటికీ, నిర్దిష్ట మొత్తానికి మించిన ఖర్చు చేస్తే ఆ రుసుమును తిరిగి తీసుకోరు. ఇందులో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కొనుగోళ్లపై మంచి రాయితీలు లభిస్తాయి. ఇదే విధంగా ఐడీఎఫ్‌సీ బ్యాంకు అందిస్తున్న కార్డు పూర్తిగా ఉచితంగా ఉండటంతో పాటు ఎన్నేళ్లు వాడినా ఎలాంటి రుసుములు లేవు. తరచుగా బిల్లు చెల్లింపులు చేసే వారికి, ప్రయాణాలు ఎక్కువగా చేసే వారికి ఇది మంచి ప్రయోజనాలను అందిస్తుంది. యాక్సిస్ బ్యాంకు ఏస్ కార్డు కూడా రోజువారీ అవసరాలైన విద్యుత్, నీరు, వంటగ్యాస్ బిల్లులు చెల్లించినప్పుడు అధిక లాభాలు అందిస్తోంది. అంతేకాదు, కొన్నిసార్లు విమానాశ్రయంలో విశ్రాంతి మందిరాల వినియోగం కూడా ఉచితంగా లభిస్తుంది. ప్రైవేట్ రంగంలో ముందుండే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అందిస్తున్న మనీబ్యాక్ ప్లస్ కార్డు మాత్రం ఆన్‌లైన్ షాపింగ్ ఎక్కువగా చేసే వారికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దేశంలోని ప్రధాన కొనుగోలు వేదికలపై ఖర్చు చేస్తే రెట్టింపు లాభాలు లభించటం ఈ కార్డు ప్రత్యేకత.



# నానబెట్టిన గింజలు ఎప్పుడు తినాలి?

నానబెట్టిన గింజలను తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని సూచిస్తారు నిపుణులు. వీటి వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎన్నో విటమిన్ల సమూహం ఈ నానబెట్టిన గింజలు. ఇవి శరీరంలో శక్తిని పెంచుతాయి. మరి వీటి వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటి? ఎప్పుడు తినాలి అనే వివరాలు తెలుసుకుందాం.. నానబెట్టిన బాదం కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అంతేకాదు జ్ఞాపక శక్తిని పెంచడంలో కూడా తోడ్పడుతుంది. అయితే ఈ నానబెట్టిన గింజలను ఉదయం తీసుకుంటే బరువు తగ్గడంలో కూడా ఉపయోగపడతాయి అంటున్నారు నిపుణులు. కొన్ని కిలోల బరువు తగ్గాలి అనుకుంటే పిస్తా, వాల్ నట్స్ లను నానబెట్టి తినండి. దీని వల్ల తొందరగా రిజల్ట్ వస్తుందట. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా ఈ నానబెట్టిన గింజలు మంచి పాత్రను పోషిస్తాయి. వీటివల్ల మరో ముఖ్యమైన ప్రయోజనం కూడా ఉందండోయ్..అదేంటి అంటే.. ఈ మధ్య కాలంలో చాలా మంది గుండె సమస్యల వల్ల సతమతమవుతున్నారు. అయితే నానబెట్టిన గింజలను తిన్న వారికి గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది అని చెబుతున్నారు నిపుణులు. ఇక ఫ్రీ రాడికల్స్ ను తొలగించడంలో వాల్ నట్స్ బాదం ప్రధాన పాత్ర పోషిస్తాయట. మరి ఇంకెందుకు ఆలస్యం నానబెట్టిన గింజల వలను ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయని తెలుసుకున్నారు కదా.. వీలుంటే తినేయండి. కానీ ఒకసారి వీటి గురించి పూర్తిగా తెలుసుకోవడం అవసరం. మేము ఇచ్చిన సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే.



# విటమిన్ డి ఎలా వస్తుంది?

శరీరానికి చాలా విటమిన్లు అవసరం. ఇక విటమిన్ డి న్యూరోట్రాన్స్ మీటర్ లా పనిచేస్తుంది. మెదడు నుంచి శరీరంలోని అన్ని అవయవాలకు సందేశాలను పంపిస్తుంది. ఇది హార్మోన్ల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అయితే విటమిన్లు లోపిస్తే ఆరోగ్యం దెబ్బతినడమే కాదు శరీరంలోని డోపమైన్ స్థాయి ప్రభావితం అవుతుంది. డిప్రెషన్ వంటి వ్యాధుల బారిన కూడా పడుతారు. అయితే విటమిన్ డి మాత్రం ఎలాంటి ఖర్చు లేకుండానే వస్తుంది. దీని కోసం ఎండలో నిల్చుంటే చాలు. కేవలం సూర్యుని నుంచి వచ్చే ఎండను శరీరానికి తాకేలా చేస్తే సరిపోతుంది. ఇంతకీ ఏ సమయంలో కూర్చోవాలి. ఎంత సమయం కూర్చోవాలి? ఎప్పుడు కూర్చోవాలి? వంటి సందేహాలు చాలా మందిలో ఉంటాయి. మరి ఆ విషయాలను మీరు కూడా తెలుసుకోవాలి అనుకుంటే ఈ ఆర్టికల్ ను చదివేసేయండి. అయితే సూర్యుని ఎండ వల్ల విటమిన్ డి సప్లిమెంట్లను పొందవచ్చు. ఇక ఈ ఎండకోసం ప్రతిరోజు 10 నుంచి 30ని. సూర్యరశ్మిలో నిల్చోవాలి. ఇక ఎండలో ఎంత సేపు ఉండాలి అనేది వ్యక్తిని బట్టి ఉంటుంది. పరిస్థితిని బట్టి కూడా ఉంటుంది. సూర్యకాంతిలోనే విటమిన్ డి ఎక్కువగా లభిస్తుంది. అయితే ఇలా మీరు సూర్యరశ్మిలో ఉన్నప్పుడు మీ చర్మం రంగు మారే అవకాశం ఉంటుంది. ఈ కాంతే విటమిన్ డి కి మూలంగా ఉంటుంది. అయితే ఈ విటమిన్ డి పిల్లలు, శిశువులు పెద్దలు అందరికి కూడా ఒకేలా ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు ఉదయం వేడి ఎక్కువ ఉంటుంది. అందుకే ఉదయమే ఎండలో నిల్చోవాలి. ఈ ఎండలో మాత్రమే విటమిన్ డి వస్తుంది. ఇక ఈ విటమిన్ డి ఉదయం మాత్రమే వస్తుంది. అయితే ఎక్కువ సేపు కూడా ఎండలో నిల్చోకూడదు. దీని వల్ల చర్మానికి ఏవైన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాదు ఒత్తిడి, సన్ ఇన్ఫెక్షన్లు, స్కిన్ క్యాన్సర్ లు కూడా వస్తుంటాయి. అందుకే ఎండలో ఉంటే సన్ స్కీన్ ను వాడడం మంచిది.

# కర్బూజ..తింటే భాగ్యం.. ఒంటికి సౌఖ్యం..



ఎండలు మండిపోతున్నాయి. మార్చిలోనే మే నెలను గుర్తుకు తెస్తున్నాయి. మున్ముందు రోజుల్లో ఎండలు మరింత మండిపోతాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ ఎండలకు భయపడి చాలామంది బయటకు వెళ్లరు. మరి అత్యవసరమైన పని ఉన్నవాళ్లు కచ్చితంగా వెళ్లాల్సిందే. అలాంటివారు ఎండలకు ఊరికే నీరసపడిపోతారు. చెమట రూపంలో శరీరంలో లవణాలను కోల్పోతారు. ఇలాంటప్పుడు శరీరానికి శక్తి కావాల్సి ఉంటుంది. ఆ శక్తిని భర్తీ చేయడానికి ఎన్నో పండ్లు ఉన్నాయి. అలాంటి పండ్లల్లో.. కర్బూజ ముఖ్యమైనది. ఇది ఎండాకాలంలో ఎక్కువగా లభిస్తుంది. ఆఫ్రికాలో పుట్టింది:వాస్తవానికి కర్బూజ పండును తర్బూజ అని కూడా పిలుస్తారు. ఈ పండు ఆఫ్రికా ఖండంలో పుట్టింది. ఆ తర్వాత మధ్యధరా దేశాల మీదుగా ఐరోపా, దక్షిణాఫ్రికా, ఆసియా దేశాలకు విస్తరించింది. ఈ పండును పశ్చిమ ఆఫ్రికాలో విస్తారంగా సాగు చేస్తారు. అయితే అక్కడి ప్రజలు పండుగ విత్తనాల కోసం సాగు చేయడం విశేషం. అయితే ఈ పండు మొదట్లో ఈ స్థాయిలో తీయగా ఉండేది కాదట. కొంచెం చేదుగా ఉండేదట. దీనిని అనేక రకాలుగా అభివృద్ధి చేసి తీపి రకాన్ని ఆవిష్కరించారట. ఇప్పుడు ఆ తీపి రకం విత్తనాల కాయలనే మనం తింటున్నాం. అందువల్లే కర్బూజ పండుకు వేసవిలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది. కర్బూజ పండును ఈజిప్టు ప్రజలు నాలుగువేల సంవత్సరాల క్రితమే సాగు చేశారట. అక్కడి ప్రాచీన సమాధుల మీద ఉన్న చిత్రాల ఆధారంగా చరిత్రకారులు ఈ విషయాన్ని గుర్తించారు. మరణం తర్వాత తన పూర్వీకులు దాహం తీర్చుకోవడానికి ఈ పండ్లు ఉపకరిస్తాయని అక్కడి ప్రజలు నమ్మేవారట. గ్రీకు దేశస్తులు కర్బూజ కాయను పెపాన్ అని పిలుస్తారు. చిన్నపిల్లలకు గుండెపోటు వస్తే కర్బూజ తొక్కలను తల మీద పెట్టి చికిత్స చేసేవారట. కర్బూజ ను శరీరానికి చల్లదనాన్ని కలిగించే ఆహారంగా గ్రీకు దేశస్థులు భావించే వారట. కర్బుజా కాయ ఈ 1856లో వివాదాలకు కూడా కారణమైంది. వాటర్ మెలన్ రాయట్.. తెలుగులో చెప్పాలంటే కర్బూజ దొమ్మి అనే ఘటన చోటు చేసుకుంది. అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి ఓ రైలు బయలుదేరింది. అది ఆ ఏడాది ఏప్రిల్ 15న పనామా రాజధానికి చేరుకుంది. అక్కడ దిగిన ఒక వ్యక్తి దగ్గర్లో ఉన్న పండ్ల దుకాణానికి వెళ్ళాడు. ఓ కర్బూజ ముక్క తీసుకున్నాడు. డబ్బులు చెల్లించకపోవడంతో.. ఆ వ్యాపారి గట్టిగా అడిగాడు. దీంతో ఆ ప్రయాణికుడు తుపాకీ తీశాడు. ఆ వ్యాపారి కూడా అంతే ఆవేశంగా తన దగ్గర ఉన్న కత్తి తీసి దాడి చేయబోయాడు. దీంతో ఆ ఘటన చినికి చినికి గాలి వాన లాగా మారింది. చివరికి అమెరికన్ ప్రయాణికులు, స్థానికుల మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది గాయపడ్డారు.కర్బూజ పండులో 92 శాతం నీరు ఉంటుంది. పండుగా తిన్నా, పండ్ల రసంగా తాగిన ఒకే రకమైన ఉత్సాహాన్ని ఇస్తుంది. ఇందులో విటమిన్ ఏ, సీ పుష్కలంగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని, కంటి చూపును అవి మెరుగుపరుస్తాయి. జీర్ణ క్రియను పెంపొందిస్తాయి. కర్బూజా లో ఉండే లైకోపీన్ అనే ఆరోగ్యకరమైన కొవ్వును పెంపొందిస్తుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఇది రుచికి తియ్యగా ఉన్నప్పటికీ ఇందులో కేలరీలు, కొవ్వులు తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా మలబద్ధకాన్ని నివారిస్తుంది. లవణాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వేసవికాలంలో దీనిని తరచూ తీసుకుంటే శరీరానికి నీరసం అనేది రాదు. ఇంకా కొన్ని అధ్యయనాల్లో ఇది క్యాన్సర్ ను కూడా నివారిస్తుందని తేలింది.

# ఈ డ్రింక్ తాగితే ఎక్కడా లేని శక్తి



మార్చిలోనే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మండే ఎండతో మాడు పగలగొడుతున్నాడు. ఏదైనా పని మీద బయటకు వెళ్లి ఇంటికి వస్తే చాలు నీరసం ఆవహిస్తోంది. ఒంటినిండా చెమట పడుతోంది. ఇలాంటప్పుడు ఏం కాదని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం ముంచుకొస్తుంది. ఈ క్రమంలో ఒంటికి సత్వర శక్తి ఇచ్చే పానీయం కావాలి. అలాంటి పానీయాలలో ముందు వరుసలో ఉండేది కొరియన్ మ్యాంగో మిల్క్ రెసిపీ. వాస్తవానికి ఇప్పుడు మ్యాంగో (మామిడి పండ్లు) సీజన్ కాకపోయినప్పటికీ.. సూపర్ మార్కెట్లో మామిడి పండ్లు లభిస్తూనే ఉన్నాయి. అలా లభించినప్పుడు కొన్ని మామిడి పండ్లను తీసుకొచ్చి ఫ్రిజ్లో పడేస్తే చాలాకాలం నిల్వ ఉంటాయి. మ్యాంగో మిల్క్ కంటే కొరియన్ మ్యాంగో మిల్క్ షేక్ విభిన్నమైన రుచి కలిగి ఉంటుంది. పైగా ఇందులో పోషకాలు అధికంగా ఉంటాయి. అందువల్ల శరీరానికి అవి సత్వర శక్తిని అందిస్తాయి. ఇంతకీ దీన్ని ఎలా తయారు చేయాలంటే.. ముందుగా పండిన మామిడికాయను తీసుకొని..దానిని శుభ్రంగా కడగాలి. అనంతరం అందులో ఉన్న గుజ్జును తీసి మిక్సీ పట్టాలి. అలా మిక్సీ పడితే రసం బయటకు వస్తుంది. ఆ రసంలో ఐసు ముక్కలు, పాలను కలపాలి. తర్వాత నానబెట్టుకున్న సగ్గుబియ్యాన్ని మిక్సీలో పట్టాలి. అనంతరం మామిడి రసం, పాలు, ఐస్ మిశ్రమంలో సగ్గుబియ్యం మిక్స్ కలపాలి. ఇలా చేస్తే సూపర్ క్రిమి, స్మూత్ టెక్స్చర్ వస్తుంది. అయితే ఇందులో షుగర్ లెవెల్స్ అధికంగా ఉంటాయి. అలాంటప్పుడు డయాబెటిక్ ఉన్నవారు వైద్యుల సలహాల మేరకు తీసుకోవాలి. అలా తయారుచేసిన కొరియన్ మ్యాంగో మిల్క్ షేక్ ను ఫ్రిజ్ లో ఉంచి.. దానిపై కొన్ని డ్రైఫ్రూట్స్ వేసుకొని తాగితే భలే టేస్ట్ ఉంటుంది. ఎండాకాలంలో నీరసంగా ఉన్నప్పుడు ఈ మిల్క్ షేక్ తాగితే ఉపయుక్తంగా ఉంటుంది. శరీరం సత్వరమే రీఛార్జ్ అవుతుంది. దీనివల్ల పోయిన లవణాలను తిరిగి శరీరం పెంపొందించుకుంటుంది.. జీర్ణ క్రియను పెంపొందిస్తుంది. శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచుతుంది. మిల్క్ షేక్ లో ఉన్న ఫ్రక్టోజ్ సత్వరంగా శక్తిని ఇస్తుంది. అయితే ఈ మిల్క్ షేక్ ను డయాబెటిక్, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారు వైద్యుల సలహాల మేరకు తీసుకుంటే బాగుంటుంది.


# బీర్ తాగుతున్నారా?



నేటి కాలంలో ప్రతి ఒక్కరూ రోజంతా ఏదో ఒత్తిడితో ఉంటున్నారు. ఉద్యోగులు, వ్యాపారులతో పాటు యూత్ కూడా కొన్ని విషయాల్లో టెన్షన్ పడుతున్నారు. దీంతో అప్పుడప్పుడు రిలాక్స్ కోసం ఫ్రెండ్స్ తో కలిసి మందేసి చిందేయాలని అనుకుంటారు. ఈ క్రమంలో ఎక్కువగా చల్లటి బీర్ తాగడానికి ఎక్కువగా ఇంట్రెస్ట్ పెడుతారు. బీర్ అనగానే చాలా మంది ఏదో తెలియని ఉత్సాహం. ఓ వైపు బాడీని కూల్ చేయడంతో పాటు మరోవైపు మత్తెక్కించే బీర్ తాగడం వల్ల ఎంజాయ్ చేస్తామని చాలా మంది పేర్కొంటారు. అయితే బీర్ తాగేటప్పుడు కొందరు ఫుడ్ విషయంలో ఈ తప్పులు చేస్తారు. దీంతో మానసికోల్లాసం అటుంచి కొత్త రోగాలు వస్తాయని అంటారు. ఇంతకీ అసలు విషయమేంటంటే? చల్లటీ బీర్ తాగేటప్పుడు వాటికి మంచింగ్ కోసం స్పైస్ ఫుడ్ ఉండాలని కోరుకుంటారు. దీంతో చికెన్, రోస్టెడ్ ఫుడ్ ఉండేవి తీసుకుంటారు. అంతేకాకుండా మాంసాహారం తీసుకోవడం వల్ల మంచి ఎనర్జీ ఉంటుందని భావించి ఎక్కువగా వాటికే ప్రిఫరెన్స్ చేస్తారు. అయితే ఇవి తాత్కాలికంగా మంచి రుచిని అందిస్తాయి. దీర్ఘకాలికంగా వీటితో అనర్థాలే అని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే బీర్ తాగడం వల్ల శరీరం డీ హైడ్రేషన్ కు గురవుతుంది. ఇలాంటి సమయంలో స్పైస్ ఫుడ్ తీసుకోవడం డైజేషన్ సమస్యలు వచ్చి అనారోగ్యానికి గురవుతారు. ఈ నేపథ్యంలో అసలు బీర్ తాగేటప్పుడు ఎలాంటి ఫుడ్ తీసుకోవాలి? అనే సందేహం ఉంటుంది. బీర్ లో ఎక్కువగా సోడియం ఉటుంది. దీనికి విరుద్ధమైన ఫుడ్స్ తీసుకోవడం వల్ల ఎలాంటి సమస్యలు ఉండవు. అంటే ఫ్రూట్స్ తో పాటు ఫైబర్ ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవడం మంచిదని అంటున్నారు. ఫైబర్ ఎక్కువగా ఉండే ఫుడ్ తో పాటు లైట్ ఫుడ్ తీసుకోవడం వల్ల ఎలాంటి జీర్ణ క్రియ సమస్యలు ఉండవు. అందువల్ల బీర్ తాగే వారు ఫుడ్ విషయంలో ఎలాంటి పొరపాటు చేయకుండా జాగ్రత్తగా ఉండాలి. ఇక కొందరు బీర్ తాగేటప్పుడు అస్సలు ఫుడ్ తీసుకోరు. కానీ ఇది చాలా ప్రమాదం. ఎలాంటి ఆల్కహాల్ తీసుకున్నా లైట్ ఫుడ్ తప్పనసరి తీసుకోవాలి. దీంతో శరీరంలోని జీర్ణక్రియ సమతుల్యమై ఆల్కహాల్ ఎఫెక్ట్ శరీరంపై పడకుండా ఉంటుంది. లేకుంటే అల్కహాల్ ఎక్కువై శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది రాను రాను కిడ్నీలను నాశనం చేసే స్థాయికి వెళ్తుంది. అందువల్ల మానసికోల్లాసానికి మోతాదు ఆల్కహాల్ మంచిదే అయినా ఫుడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.


# బొప్పాయి, దానిమ్మ పండ్లు కలిపి తింటున్నారా..?

మామూలుగా వైద్యులు తరచూ తాజా పండ్లను తీసుకోవాలని చెబుతూ ఉంటారు. తాజా పండ్ల వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని, ఎన్నో రకాల సమస్యలకు చెక్ పెట్టవచ్చని చెబుతూ ఉంటారు. అటువంటి వాటిలో దానిమ్మ, బొప్పాయి కూడా ఒకటి. ఈ రెండు పళ్ళను చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరు కూడా ఇష్టపడుతూ ఉంటారు. కొందరు వీటిని విడివిడిగా తింటే మరికొందరు కలిపి తింటూ ఉంటారు. కాగా దానిమ్మలో ఎల్లా గిటానిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. దీన్ని తినడం వల్ల శరీరంలో వాపు తగ్గుతుంది. ఎల్లాగిటానిన్ ఆక్సీకరణ మెదడు కణాలను ప్రోత్సహిస్తుంది. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధి నుండి కూడా రక్షిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచి రక్తహీనత సమస్య లేకుండా చేస్తుంది. మొటిమలు, నల్లని మచ్చలను తొలగించడానికి సహాయపడుతుంది. అలాగే చుండ్రును తగ్గించి జుట్టు రాలకుండా ఒత్తుగా పెరిగేలా ప్రోత్సహిస్తుంది. వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేస్తుంది.బొప్పాయి, దానిమ్మ పండును కలిపి తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. అదనంగా, ఇది అనేక రకాల వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. ఈ రెండు పండ్లు అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. ఎర్ర రక్త కణాలను ప్రోత్సహిస్తాయి. దీని వల్ల శరీరంలో రక్త కొరత ఉండదు. రక్తహీనత వంటి వ్యాధులను నివారించడంలో పండ్లు



ఎంతో మేలు చేస్తాయి. అంతే కాకుండా ఇమ్యూనిటీ బూస్టర్‌గా పనిచేస్తుంది. అదే సమయంలో మలబద్ధకం, ఊబకాయం సమస్యలను దూరం చేస్తుంది. ఉత్తమమైన విషయం ఏమిటంటే, ఈ రెండు పండ్లను కలిపి తినడం వల్ల శరీరంలోని మల్టీవిటమిన్ల లోపాన్ని తీరుస్తుంది. బొప్పాయి, దానిమ్మ పండును కలిపి తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. అదనంగా, ఇది అనేక రకాల వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. ఈ రెండు పండ్లు అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. ఎర్ర రక్త కణాలను ప్రోత్సహిస్తాయి. దీని వల్ల శరీరంలో రక్త కొరత ఉండదు. శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి ఎటువంటి ఇన్ఫెక్షన్స్ రాకుండా ముఖ్యంగా ఈ సీజన్ లో కాపాడుతుంది. అలాగే రక్తపోటు నియంత్రణలో ఉండేలా చేస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు .నియంత్రణలో ఉండేలా చేస్తుంది. కాబట్టి ఈ జ్యూస్ ని వారంలో రెండు లేదా మూడు సార్లు తీసుకోవడానికి ప్రయత్నం చేస్తే ఇప్పుడు చెప్పిన అన్ని రకాల ప్రయోజనాలను పొందవచ్చు.

# నిద్రలో అలా జరిగితే.. ఈ వ్యాధి బారిన పడ్డట్లే!



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు కొత్త వ్యాధులతో మానవులు ప్రాణాలు కోల్పోతున్నారు. అందువలన ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మనం తీసుకుంటున్న ఆహారం,జీవన శైలి కారణంగా అనేక అనారోగ్య సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అందులో స్లీప్ పెరాలసిస్ ఒకటి. స్లీప్ పెరాలసిస్ అనేది పడుకున్నప్పుడు ఒక్కసారిగా కదలడంలో ఇబ్బంది, మాట్లాడక లేకపోవడం, శ్వాస తీసుకోవడంలో సమస్యలు, భయం భయం, విచిత్రమైన శబ్ధాలు వినిపించడంలా అనిపిస్తే అది స్లీప్ పెరాలసిస్. ఇది 1417 ఏళ్ల వయస్సులో మొదటిసారిగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ స్లీప్ పెరాలసిస్ అనేది 10 నుంచి 15 నిమిషాల పాటు మాత్రమే ఉంటుంది. అయితే ఇది ఎక్కువగా కొన్ని రకాల మందులు, ఆయుర్వేద మెడిసిన్ లాంటివి అతిగా వాడే వారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఇంటింటికి ఇందిరమ్మ చీర

(మొదటి పేజీ తరువాయి)

కొత్త లబ్ధిదారుల గుర్తింపులో పౌర సరఫరాల శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత లబ్ధిదారులు, కొత్తగా చేరిన వారి వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన SERP ప్రొఫైల్ యాప్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు.

పంపిణీ కార్యక్రమాన్ని దశలవారీగా నిర్వహిస్తున్నట్లు సీతక్క పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నవంబర్ 19 నుంచి డిసెంబర్ 9 వరకూ మొదటి దశ, పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి 9 వరకూ రెండో దశగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రతి నియోజకవర్గానికి సబ్ కలెక్టర్ లేదా ఆర్‌డిఓ స్థాయి అధికారిని ప్రత్యేక పర్యవేక్షకులుగా నియమించాలని జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.



ఇందిరమ్మ చీరల పంపిణీ సందర్భంగా మహిళా స్వయం సహాయక బృందాల ప్రాముఖ్యతను, ఇందిరమ్మ మహిళా శక్తి విజయాలను ప్రతిబింబించే విధంగా నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు సాగాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ప్రజాప్రతినిధులను మండల స్థాయి కార్యక్రమాలకు ఆహ్వానించాలని సూచించారు.

గ్రామాల స్థాయిలో ప్రభుత్వ సిబ్బంది, స్వయం సహాయక బృందాల సభ్యులు కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చీరలను బొట్టుపెట్టి అందించడం ద్వారా ఇంటింటా పండుగ వాతావరణం నెలకొల్పాలని సీతక్క పేర్కొన్నారు. మహిళల ఐక్యతను ప్రతిబింబించేలా ఇంటింటికీ ఇందిరమ్మ చీరలు చేరే విధంగా కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు.

సెర్ప్ యాప్‌లో ఆధార్ డేటా, ఫోటోలు తదితర వివరాల నమోదు అవసరమవుతున్నందున అధికారులు సంపూర్ణ సన్నద్ధతతో పనిచేయాలని మంత్రి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఈ పథకాన్ని మహిళల జీవితాల్లో ప్రత్యేకమైన పండుగలా మార్చాలని సీతక్క ఆదేశించారు.

# నాబార్డ్ ఎర్త్ సమ్మిట్‌లో భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావవంతమైన భాగస్వామిగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. రైతులకు శక్తినిచ్చే విధంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను భట్టి విక్రమార్క వివరించారు. రుణమాఫీ, పారదర్శక ధాన్యం కొనుగోలు విధానం, డిజిటల్ క్రాప్ మానిటరింగ్ సిస్టమ్, గ్రామీణ కనెక్టివిటీ, వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయ విధానాలు ఇవి అన్నీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికే చేపడుతున్న ప్రయత్నాలని ఆయన చెప్పారు. నాబార్డ్‌తో నిజమైన సహకారం కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. టెక్నాలజీ ఆధారిత, ఆధునిక, మన్నికైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిర్మాణమే తెలంగాణ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దిశలో నాబార్డ్‌తో కలిసి పనిచేసి రైతులకు మరింత మద్దతు అందించను




న్నట్టు హామీ ఇచ్చారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని మార్చడంలో నాబార్డ్ ఎర్త్ సమ్మిట్ వంటి వేదికలు కీలక మార్గనిర్దేశకాలు అవుతాయని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ఈ సమ్మిట్‌లో రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి దిశగా పలు ముఖ్య చర్చలు జరిగినట్లు అధికారులు తెలిపారు.



# రైతులకు ఇబ్బంది లేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు

- కొల్లాపూర్‌లో కేంద్రాలను ప్రారంభించిన మంత్రి జూపల్లి
- కుడికిల్ల, నార్లాపూర్ కేంద్రాల ప్రారంభం
- -తేమ శాతానుసారం వెంటనే కొనుగోలు
- రైతుల ఖాతాల్లో నిధులు జమయ్యేలా ఆన్‌లైన్ పద్ధతి

**కొల్లాపూర్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**



కొల్లాపూర్ నియోజకవర్గంలోని కుడికిల్ల, నార్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో కలిసి ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని, తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉంటే వెంటనే కొనుగోలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి పేరాలో కొనుగోలు కేంద్రాలన్నీ ప్రతిరోజూ అధికారులు పరిశీలించాలని, ఏ మాత్రం జాప్యం లేకుండా ధాన్యం స్వీకరించాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వారి ఖాతాల్లో నిధులు వేగంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో పేరాలో ధాన్యం విక్రయించిన వెంటనే రైతులకు రసీదు ఇవ్వడం తప్పనిసరి అని మంత్రి అన్నారు. ధాన్యం కేంద్రానికి ఇచ్చిన తర్వాత రైతులకు మరెంత సంబంధం ఉండదని, మిల్లులకు తరలింపు, నిల్వ వంటి బాధ్యతలు పూర్తిగా అధికారులు, నిర్వాహకులవేనని స్పష్టం చేశారు. మూడో పేరాలో కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి వసతులు, సంరక్షణ షెడ్లు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని, అలా చేస్తే న్యాయమైన ధర మరియు వేగవంతమైన చెల్లింపు లభిస్తుందని ఆయన చెప్పారు. గ్రామీణ రైతుల ప్రయోజనార్థం ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు పంట కొనుగోలు ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చుతున్నాయని స్థానిక అధికారులు పేర్కొన్నారు.

# డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో కవిత

- మహాత్మా గాంధీ విగ్రహానికి కవిత నివాళులు
- సే నో టు డ్రగ్స్‌పై విద్యార్థులతో అవగాహన ర్యాలి
- రంగారెడ్డి పర్యటనకు జాగృతి జనంబాట కార్యక్రమం

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**




జాగృతి జనంబాట కార్యక్రమం లో భాగంగా రంగారెడ్డి జిల్లాలో పర్యటించేందుకు బయలుదేరిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముందుగా కూకట్‌పల్లిలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. గాంధీజీ చూపించిన అహింసా మార్గం, స్వచ్ఛత, సమాజ సేవ వంటి విలువలు నేటి తరానికి మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నట్లు సమాచారం. ప్రజల్లో సామాజిక బాధ్యత పెరగడానికి గాంధీ తత్వం ప్రతి ఇంటికీ చేరాలని ఆమె అభిప్రాయపడ్డారు.

అనంతరం 'సే నో టు డ్రగ్స్' ప్రచారంలో భాగంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలో కవిత పాల్గొన్నారు. యువత దేశం భవిష్యత్తని, వారు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా సమాజం కలిసి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. డ్రగ్స్ వ్యసనం వ్యక్తుల ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలకు, సమాజానికి కూడా ప్రమాదకరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని "డ్రగ్స్‌కు నో చెప్పండి" అంటూ నినాదాలు చేశారు. ర్యాలి సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కవిత ముచ్చటించి, వ్యసనాలపై అవగాహన పెంచే కార్యక్రమాలను పాఠశాలలు తరచూ నిర్వహించాలని సూచించారు. డ్రగ్ మాఫియాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజల సహకారం లేకుండా ఈ సమస్యను పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదని ఆమె పేర్కొన్నారు. జాగృతి జనంబాట పర్యటన ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకోవడం, యువతలో అవగాహన పెంచడం, సమాజంలో సానుకూల మార్పులకు వేదిక కల్పించడం ప్రధాన లక్ష్యమని కవిత తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో ఆమె పర్యటన సందర్భంగా పలు సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు జరగనున్నాయి.

# బీహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు

- 10వ సారి సీఎం కుర్చీలో నితీశ్ కుమార్
- గాంధీ మైదాన్‌లో జరిగిన ప్రమాణ స్వీకార వేడుక
- ఇద్దరు డిప్యూటీ సీఎంల ప్రమాణం – 14 మంది బీజేపీ మంత్రుల చేరిక
- ఎన్డీయేకు 202 స్థానాలతో భారీ మెజారిటీ

**పాట్నా, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

బీహార్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జేడీయూ అధినేత నితీశ్ కుమార్ పదవీ ప్రమాణం చేస్తూ మరోసారి చరిత్ర సృష్టించారు. పాట్నా గాంధీ మైదాన్‌లో రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ నితీశ్ కుమార్‌కు ముఖ్యమంత్రి పదవీ ప్రమాణం చేయించారు. దీతో ఆయన పదోసారి బీహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి అరుదైన రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో సామ్రాట్ చౌదరి, కుమార్ సిన్హాలు డిప్యూటీ ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీకి చెందిన 14 మంది ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వేడుకకు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖ నాయకులు హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తదితర ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే గట్టి విజయం సాధించింది. మొత్తం 243 స్థానాల్లో 202 స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లాయి. బీజేపీ 89, జేడీయూ 85 స్థానాలు గెలుచుకోగా, మిత్రపక్షాలైన ఎల్‌జేపీ (రామ్ విలాస్) 19, హెచ్‌ఏఎం 5, ఆర్‌ఎల్‌ఎస్‌పీ 4 స్థానాలు దక్కించుకున్నాయి. ఈ విజయంతో ఎన్డీయే బీహార్‌లో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగా, నితీశ్ కుమార్ దశమసారి సీఎం పదవిని చేపట్టడం రాజకీయ వర్గాల్లో విశేష చర్చనీయాంశంగా మారింది.






# కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించడం రాజకీయ కక్షసాధింపు

- ఫార్ములా ఈ రేస్‌పై పారదర్శకత ఉన్నా రెండేళ్లుగా కాంగ్రెస్ విచారణ పేరుతో డ్రామా
- రేవంత్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తోందన్న ఆరోపణ
- స్థానిక ఎన్నికల ముందు చిల్లర రాజకీయాలు ప్రజలకు స్పష్టమవుతున్నాయన్న విమర్శ
- హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 20 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించడం పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యేనని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. హైదరాబాదుకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన కేటీఆర్‌పై రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. హరీశ్ రావు మాట్లాడుతూ, "మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష్యసాధింపు చర్యలకు ఇది పరాకాష్ట" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ ప్రజల కోసం ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని ఆయన నిలదీశారు. రెండేళ్లుగా ఫార్ములా-ఈ రేస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నట్లు నటిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. పూర్తిస్థాయి పారదర్శకతతో జరిగిన ఈ ఈవెంట్‌పై విచారణ పేరుతో తప్పుడు కథనాలు తయారు చేసి, కేటీఆర్‌ను అడ్డుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి రాక్షసానందం పొందడం అప్రజాస్వామికమని హరీశ్ రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దశలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ చిల్లర డ్రామాలు ఆడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమ కేసులతో కేటీఆర్ లేదా బిఆర్ఎస్ నాయకులను బలహీనపరచలేరని హరీశ్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్‌కు బిఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూపుతున్న దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటామని ఆయన తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యాఖ్యలు మరోసారి ఉద్రిక్తతను పెంచాయి.

# విద్యాబోధనలో రామయ్య సేవలను స్మరించిన నాయకులు

- కేటీఆర్‌పై కేటీఆర్‌పై విద్యానగర్‌లో పుట్టినరోజు వేడుకలు సాదాసీదాగా
- కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు నేతల శుభాకాంక్షలు

హైదరాబాద్, నవంబర్ 20 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):

ప్రముఖ విద్యావేత్త, ఐఐటీ రామయ్యగా పేరొందిన చుక్కా రామయ్య గారి 100వ పుట్టినరోజు సందర్భంగా పలువురు నేతలు హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఆయన నివాసాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నేత పొన్నం ప్రభాకర్, సీఎడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న లక్ష్మారెడ్డి, మాడభూషి శ్రీధర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శతాబ్ది వేడుకల సందర్భంగా రామయ్య గారి విద్యా సేవలను నాయకులు స్మరించారు. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆయన పోషించిన పాత్రను ప్రశంసిస్తూ, విద్యా రంగంలో ఆయన వేసిన పునాది ఇప్పటికీ విద్యార్థులకు ఆదర్శమని వారు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలోని సామర్థ్యాన్ని వెలికితీసే గురువుగా రామయ్య ఖ్యాతిని గుర్తుచేశారు. విద్యానగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున రాజకీయ నాయకులు, విద్యారంగ ప్రముఖులు పాల్గొని రామయ్య గారిపై గౌరవాన్ని వ్యక్తపరిచారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా నేతలు పుష్పగుచ్ఛాలు అర్పించి, ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యా రంగంలో ఇలాంటి మహనీయుల సేవలు కొత్త తరాలకు ఆదర్శమని వ్యాఖ్యానించారు. చుక్కా రామయ్య శతజయంతి సందర్భంగా విద్యా రంగ అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని నేతలు ఆకాంక్ష వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అవకాశాల పెరుగుదల దిశగా ఇలాంటి మహనీయుల స్ఫూర్తి దిశానిర్దేశం చేస్తుందని అన్నారు.

